RNI Reg-No.APTEL/2005/19204

ESTD : 1996

# నేటి మనదేశం

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

https://netimanadesam.com/

సంపుటి :21 సంచిక 72 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి శుక్రవారం 13-3-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీవిశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, తిథి ॥దశమి తె॥ 5.57, పూ.షా. రా ॥1.12, వర్జ్యం ఉ॥9.28 -11.12, దుర్ముహూర్తం ఉ॥8.40-9.27, శుభ సమయం ఉ॥ 7.30-9.00, రాహుకాలం ఉ॥10.30-12.00, సూర్యోదయం ఉ॥ 6.17, సూర్యాస్తమయం సా॥ 6.04 గం॥

## గిరిజనులకు అభివృద్ధి అందకుండ చేస్తారా?

లోపలి పేజీల్లో

-అక్కడి పనులను అడ్డుకోవడమేమిటి

-అటవీ అధికారుల తీరుపై మండిపడ్డ సీఎం చంద్రబాబు

# యుద్ధ డిమాండ్లను అంగీకరించాల్సిందే!

### అప్పుడే యుద్ధ విరమణకు అంగీకరిస్తాం

### ప్రపంచానికి తేల్చిచెప్పిన ఇరాన్ నాయకత్వం

### రెండు ట్యాంకర్లపై 'సూసైడ్ బోటు'తో దాడి

**టెహ్రాన్,మార్చి12(ఆర్ఎన్ఎ):** ఇరాన్ వర్సెస్ ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య యుద్ధం 13వ రోజుకు చేరుకుంది. ఇజ్రాయెల్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఇరాన్‌పై మిస్సైల్స్, డ్రోన్లతో దాడులు చేస్తున్నాయి. ఈ దాడుల్లో ఇప్పటి వరకు 1300 మంది ఇరానీయులు చనిపోయినట్లు తెలుస్తోంది. ఇరాన్ కూడా ఏమాత్రం వెనక్కు తగ్గటం లేదు. రెండు దేశాలపై విరుచుకుపడుతోంది. అరబ్ దేశాలలోని అమెరికా ఎయిర్‌బేస్‌లపై దాడులు చేస్తోంది. యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయిల్, గ్యాస్ ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక ప్రకటన చేశారు. యుద్ధానికి ముగింపు పలకాలంటే తమ షరతులకు అంగీకరించాల్సిందేనని తేల్చి చెప్పారు. భవిష్యత్‌లోనూ తమ దేశంపై ఎవరూ దాడులు చేయకూడదని అన్నారు. తమ న్యాయపర హక్కులను ప్రపంచం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. పశ్చిమాసియాలో శాంతి, భద్రతలకు ఇరాన్ కట్టుబడి ఉందన్నారు. అయితే, ఇరాన్ భద్రతకు గ్యారెంటీ ఇస్తేనే యుద్ధం ఆపుతామని చెప్పారు. రష్యా అధ్యక్షుడు పుతిన్, పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్‌తో ఫోన్‌లో మాట్లాడినపుడు కూడా ఇదే విషయం చెప్పామని అన్నారు. ఈ క్రమంలో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నానాటికీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా అమెరికా, దాని మిత్ర దేశాల నౌకలపై ఇరాన్ దాడులు తీవ్రమవుతున్నాయి. తాజాగా ఇరాక్ ప్రాదేశిక మిగతా 2లో..

## తిరిగి స్పీకర్ స్థానంలో విధులకు ఓంబిర్లా!

**-తనకు ఎలాంటి భేదభావాలు లేవని ప్రకటన**

**-నిబంధనల మేరకే నడచుకున్నానని వెల్లడి**

**న్యూఢిల్లీ,మార్చి12(ఆర్ఎన్ఎ):** విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిన నేపథ్యంలో గురువారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తిరిగి స్పీకర్ స్థానంలోకి వచ్చారు. అలాగే ఆయన తన పనితీరుపైనా స్పందించారు. ప్రతి ఎంపీకి లోక్‌సభలో మాట్లాడే అవకాశం కల్పించడానికి తాను ఎల్లప్పుడూ ప్రయత్నిస్తానని అన్నారు. సభ నియమ నిబంధనలకు ఎవరూ అతీతులు కారని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. ఎంపీల మైక్రోఫోన్లను నియంత్రించాననే ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. సభలో ఎవరికీ ప్రత్యేక వెసులుబాట్లు ఉండవు. నిబంధనల ప్రకారమే కార్యకలాపాలు నడుస్తాయి. ప్రధాని, మంత్రులు కూడా ఏవయినా ప్రకటనలు చేయడానికి ముందు సభ నిబంధనల ప్రకారం నోటీసులు మిగతా 2లో..

# నీటి వినియోగంలో జాగ్రత్తలు ముఖ్యం

**-భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలి -రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చే యత్నం**

**-జగన్ హయాంలో పెట్టుబడిదారుల పరార్ -జిల్లాల వారీగా పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు**

**-సంపద సృష్టిస్తేనే మెరుగైన సమాజం సాధ్యం : రెండోరోజు కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు**

**అమరావతి,మార్చి12(ఆర్ఎన్ఎ):** నీటిని సక్రమంగా వినియోగించుకుంటేనే ప్రయోజనం ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. భవిష్యత్ తరాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సచివాలయంలో సీఎం అధ్యక్షతన రెండో రోజు కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. పెట్టుబడులు, వైద్యం, సూపర్ సిక్స్-సంక్షేమం, ఆదాయార్జన శాఖలు, విద్య-నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై చర్చిస్తున్నారు. జిల్లాల వారీగా పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలను సీఎం అధికారులకు వివరించారు. రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. సంపద సృష్టించేందుకు ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకోవాలి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఎలా ఉన్నామో జిల్లాల వారీగా వివరాలు ఉండాలి. గత వైకాపా హయాంలో పెట్టుబడులకు ఎవరూ ముందుకు రాలేదు. ఉన్న కంపెనీలు కూడా పారిపోయిన పరిస్థితి అందరం చూశాం. వనరులు ఉన్నా సరైన రీతిలో ఉపయోగించుకోవాలి. లేదంటే వ్యర్థమేనని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. సంపద సృష్టితో పాటు ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రకటించారు. కుటుంబ సాధికారిత సాధించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వివిధ పథకాల లబ్ధిదారులకు ప్రజా ప్రతినిధుల ద్వారా సంక్షేమ లేఖలు అందివ్వాలని సీఎం మిగతా 2లో..

## గ్యాస్ బుకింగ్ సర్వర్లు డౌన్

**-పనిచేయని వాట్సాప్ బుకింగ్స్**

**-ఆందోళనలో వినియోగదారులు**

**అమరావతి,మార్చి12(ఆర్ఎన్ఎ):** రాష్ట్రంలో గ్యాస్ సంక్షోభం ముదురుతోంది. ప్యానిక్ బుకింగ్‌తో సర్వర్లు డౌన్ అవుతున్నాయని ఆయిల్ కంపెనీల నిర్వాహకులు చెబుతున్నారు. ఇండేన్ గ్యాస్ ఐవీఆర్ఎస్, వాట్సాప్ లు బుకింగ్ పని చేయడం లేదు. అప్పుడప్పుడు భారత్, హెచ్‌పి గ్యాస్ ఐవీఆర్ఎస్, వాట్సాప్ బుకింగ్‌లు పని చేయట్లేదు. దీనితో గ్యాస్ డీలర్లు వద్దకు వినియోగదారులు పరుగులు తీస్తున్నారు. ఏపీలో కోటి 55 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. బ్యాక్ లాగ్ తగ్గించుకునేందుకు ఆయిల్ కంపెనీలు ఇలా చేస్తున్నాయని వినియోగదారులు తెలిపారు. వినియోగదారుల మొబైల్‌కు ఓటీపీ వస్తేనే డెలివరీ ఇవ్వాలని గ్యాస్ డిస్ట్రిబ్యూటర్‌లపై ఆయా కంపెనీలు ఆంక్షలు విధించాయి. గ్యాస్ దుర్వినియోగం గాకుండా వినియోగదారుల మొబైల్ నుంచి ఓటీపీ తీసుకుంటున్నామని ఆయిల్ కంపెనీల అధికారులు చెబుతున్నారు. రోజు వారి బుకింగ్‌ల కంటే ఒక్కరోజే మూడు రెట్లు అధికంగా బుకింగ్‌లు జరిగాయని ప్రభుత్వ అధికారులు తెలిపారు. గృహ అవసరాలకు ఎలాంటి గ్యాస్ కొరత లేదని ఏపీ ప్రభుత్వం చెబుతోంది. ప్యానిక్ బుకింగ్‌తోనే ఈ సమస్య వస్తోందని ప్రభుత్వం పేర్కొంది. ఈ క్రమంలోనే కమర్షియల్ సిలెండర్‌ల సరఫరాను సగానికి పైగా ఆయిల్ కంపెనీలు తగ్గించాయి. హాస్టల్స్, ఆస్పత్రుల వంటి అత్యవసర సర్వీసులకే ఇవ్వాలని ఆయిల్ కంపెనీలు ఆదేశాలు జారీ చేశాయి. కేంద్రప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలను తాము అమలు చేస్తున్నామని కంపెనీలు చెబుతున్నాయి.

## డిఫెన్స్ రంగంలో సరికొత్త అధ్యాయం

**-జువ్వలదిన్నెలో సాగర్ డిఫెన్స్ సంస్థ ఏర్పాటు -శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్**

**-తొలిదశలో రూ.45 కోట్ల పెట్టుబడులు..750 మందికి ఉపాధి**

**-ప్రాజెక్టుకు శంకుస్థాపనపై మంత్రి నారాయణ హర్షం**

**నెల్లూరు,మార్చి12(ఆర్ఎన్ఎ):** ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాలతో పాటు రక్షణ, తయారీ రంగాల్లోనూ ఏపీని గ్లోబల్ హబ్‌గా మార్చాలన్న లక్ష్యంతో నెల్లూరు జిల్లాలో ఒక భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. నెల్లూరు జిల్లా జువ్వలదిన్నెలో సాగర్ డిఫెన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్న అటానమస్ మారిటైం షిప్ యార్డుకు రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ భూమిపూజ చేశారు. ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి అటానమస్ మారిటైం షిప్ యార్డు కావడం విశేషం. ఈ ప్రాజెక్టు ద్వారా రక్షణ రంగానికి అవసరమైన అత్యాధునిక నౌకల నిర్మాణం ఇక్కడ జరగనుంది. సాగర్ డిఫెన్స్ ఇంజినీరింగ్ పరిశ్రమ ఏపీకి వస్తున్నందుకు ఆనందంగా ఉందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. దీంతో స్థానిక మత్స్యకారుల జీవితాల్లో మార్పులు వస్తాయన్నారు. ఈ పరిశ్రమ వల్ల 25 వేల మత్స్యకార కుటుంబాలకు లబ్ధి జరుగుతుందని చెప్పారు. మత్స్యకార కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. సుదీర్ఘ సముద్ర తీరం ఉండటం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. జువ్వలదిన్నెలో అటానమస్ మారిటైమ్ షిప్‌యార్డును సాగర్ డిఫెన్స్ అభివృద్ధి చేయనుంది. మొదటి దశలో రూ.45 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. 750 మందికిపైగా ఉద్యోగాలు కల్పించనుంది. ముంబయి కేంద్రంగా పనిచేసే సాగర్ డిఫెన్స్ సంస్థ.. అన్‌మాన్డ్ మెరైన్ సర్ఫేస్ వెహికల్స్ రంగంలోనూ పనిచేస్తోంది. ఇప్పటికే దేశ నౌకాదళం, ఐడెక్స్ (ఐడీఈఎక్స్), ఇతర భద్రతా సంస్థలతో పని చేస్తోంది. ఇక్కడ ఇంటెలిజెన్స్ మారిటైం సిస్టమ్స్, సెన్సార్లు, కమాండ్ కంట్రోల్ టెక్నాలజీలను అభివృద్ధి చేయనున్నారు. భవిష్యత్తులో ఆధునిక నౌకా దళ కార్యకలాపాలకు ఈ షిప్‌యార్డు కీలకం కానుంది. మానవరహిత నౌకలు, అత్యాధునిక సాంకేతికతతో కూడిన యుద్ధ నౌకల తయారీకి ఈ కేంద్రం చిరునామాగా మారబోతోంది. ఏపీని కేవలం ఐటీ రంగంలోనే కాకుండా.. తయారీ, రక్షణ రంగాల్లో కూడా దేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. యుద్ధప్రాతిపదికన పనులు మిగతా 2లో..

## జెన్కో రికార్డు విద్యుత్ ఉత్పత్తి

**-మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడి**

**-అధికారుల కృషిని అభినందించిన మంత్రి**

**అమరావతి,మార్చి12(ఆర్ఎన్ఎ):** విద్యుత్ ఉత్పత్తిలో ఏపీ జెన్కో జీవితకాల రికార్డు సృష్టించిందని ఆంధ్రప్రదేశ్ విద్యుత్, ఇంధన శాఖల మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. 6101 మెగావాట్లతో జీవితకాల రికార్డు స్థాయిలో ఏపీ జెన్కో ఉత్పత్తి సాధించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రికార్డు స్థాయి విద్యుత్ ఉత్పత్తిపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఏపీ సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారుల నిరంతర కృషి వల్లనే ఇది సాధ్యమయ్యిందన్నారు. సీఎం చంద్రబాబు సలహాలు, సూచనలతోనే ఈ రికార్డు సాధ్యమైందని ఉద్ఘాటించారు. ఇంజినీర్లు, అధికారుల అంకితభావం, నైపుణ్యం, కృషితోనే ఈ రికార్డు సమోదైందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. వేసవి విద్యుత్ డిమాండ్ అందుకునేందుకు అధిక స్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని కొనసాగించడం కీలకమని చెప్పుకొచ్చారు. గృహ, పారిశ్రామిక, వ్యాపార సంస్థలకు నిరంతరాయ విద్యుత్ సరఫరాయే తమ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. భవిష్యత్తు విద్యుత్ డిమాండ్‌ను అందుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ప్రైవేటు వ్యక్తుల నుంచి విద్యుత్ కొనుగోలు చేసేందుకు వైసీపీ హయాంలో ఏపీ జెన్కోని నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. జగన్ హయాంలో అడ్డగోలుగా తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.32 వేల కోట్లు భారం వేశారని ఆగ్రహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా ట్రూ డౌన్ చేసిందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు.

ఆనాడు ఒక్కడినే..

## నేడు కోట్లాది మందికి అండ!

**-నల్లకాలువ సాక్షిగా ఇచ్చిన హామీ మేరకు పార్టీ స్థాపన**

**-కోట్లాది మంది ప్రజల గుండెల్లో నిండుగా ఉంది**

**-పార్టీ ఆవిర్భావ వేడుకల్లో వైఎస్ జగన్**

**అమరావతి,మార్చి12(ఆర్ఎన్ఎ):** పార్టీ స్థాపన సమయంలో తాను ఒక్కడినే ఉన్నానని, కానీ ఇప్పుడు కోట్లాది మంది ప్రజల ఆశీర్వాదంతో వైసీపీ ఒక పెద్ద శక్తిగా ఎదిగిందని వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ చెప్పారు. నల్లకాల్వలో ఇచ్చిన మాటే పార్టీ ఆవిర్భావానికి ప్రధాన కారణమైంది. ఆ ఒక్క మాట రాష్ట్ర రాజకీయాల దశ, దిశను మార్చిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. 2011 మార్చి 12న స్థాపించబడిన వైసీపీ.. ఇప్పుడు 16వ వసంతంలోకి అడుగు పెట్టింది. ఈ సందర్భంగా పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జగన్ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. దివంగత నేత వైయస్ రాజశేఖర రెడ్డి మరణం తర్వాత ఆయన ఆశయాలను కొనసాగిస్తానని, ఆయన మరణాన్ని తట్టుకోలేక చనిపోయిన కుటుంబాలను పరామర్శిస్తానని జగన్ నల్లకాల్వలో ఇచ్చిన మాట ఆ పార్టీ స్థాపనకు పునాది వేసింది. ఓదార్పు యాత్రకు కాంగ్రెస్ పార్టీ అడ్డు చెప్పడంతో.. ఇచ్చిన మాట కోసం ఆ పార్టీని వదిలి, వైయస్సార్సీపీని జగన్ స్థాపించారు. 'అప్పట్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ మిగతా 2లో..

## ఇంధన కొరత లేదు!

**-తగినన్ని క్రూడాయిల్ నిల్వలు ఉన్నాయి**

**-లోక్‌సభలో కేంద్రమంత్రి హర్దీప్ పురి సింగ్ ప్రకటన**

**-మంత్రిని హేళన చేస్తూ**

**ఎన్‌స్టీన్ ఫైళ్ల ప్రస్తావనతో గందరగోళం**



**న్యూఢిల్లీ,మార్చి12(ఆర్ఎన్ఎ):** పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ దేశంలో ఇంధన భయాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో గురువారం ఎల్‌పీజీ అంశంపై లోక్‌సభలో వాడీవేడి చర్చ జరిగింది. చర్చలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఎప్‌స్టీన్ ఫైళ్ల ప్రస్తావన తీసుకురావడంతో తీవ్ర గందరగోళం ఏర్పడింది. అయితే ఇంధన కొరతపై కేంద్రమంత్రి నిరసనల మధ్యే తన ప్రకటన చేశారు. భారత్‌లో ఇంధన కొరత లేదని, తగినన్ని క్రూడాయిల్ నిల్వలు ఉన్నాయని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి తెలిపారు. పెట్రోల్, డీజిల్, విమాన ఇంధన సరఫరాలో ఎలాంటి కొరత లేదని చెప్పారు. దేశీయ రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని అన్నారు. ప్రజలు ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయవద్దని కోరారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎల్‌పీజీ లభ్యతపై ఆందోళన నెలకొనడంతో కేంద్ర మంత్రి లోక్‌సభలో మిగతా 2లో..

## నిరసనలను లెక్క చేయని అమెరికా అధ్యక్షుడు

**-వాణిజ్య సుంకాలపై కోర్టు తీర్పు బేఖాతర్**

**-సెక్షన్ 301తో దాడికి దిగబోతున్న ట్రంప్**

**వాషింగ్టన్,మార్చి12(ఆర్ఎన్ఎ):** ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎడాపెడా విధించిన సుంకాలు చెల్లవంటూ అగ్రరాజ్య సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన క్రమంలో ట్రంప్ కొత్త ఎత్తులు వేస్తున్నారు. యుద్ధంతో దేశీయంగా తీవ్ర నిరసనలు వస్తున్నా లెక్క చేయడం లేదు. ఇతరదేశాలపై ఎలాగైనా టారిఫ్‌లు వసూలు చేయాలని కంకణం కట్టుకున్న ట్రంప్.. ఇందుకోసం కొత్తదారులు వెతుకుతున్నారు. తాజాగా 'సెక్షన్ 301' ఆయుధాన్ని బయటకు తీశారు. దీనికింద భారత్, చైనా సహా 16 వాణిజ్య భాగస్వామ్య దేశాలపై దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు అమెరికా వాణిజ్య శాఖ ప్రతినిధి జెమిసన్ గ్రీర్ కీలక ప్రకటన చేశారు. 1974 వాణిజ్య చట్టంలోని సెక్షన్ 301 కింద.. భారత్, చైనా, యూరోపియన్ యూనియన్, సింగపూర్, స్విట్జర్లాండ్, నార్వే, ఇండోనేసియా, మలేసియా, కాంబోడియా, థాయ్‌లాండ్, దక్షిణ కొరియా, వియత్నాం, తైవాన్, బంగ్లాదేశ్, మెక్సికో, జపాన్ దేశాలపై ఈ దర్యాప్తు జరగనుందని గ్రీర్ వెల్లడించారు. కాగా.. ఈ జాబితాలో కెనడా లేకపోవడం గమనార్హం. ఇతర దేశాలు అనుసరిస్తున్న అన్యాయమైన వాణిజ్య విధానాలను సవాలు చేసేందుకు అమెరికాకు ఉన్న మిగతా 2లో..

దృఢ సంకల్పం, పవిత్ర ఆశయం తప్పక సత్ఫలితాలను ఇస్తాయి. వీటిని ఆయుధాలుగా గ్రహించిన వారు అన్ని విఘ్నాలను ప్రతిఘటించి నిలువగలుగుతారు.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# ఎగుమతి,దిగుమతులను సమీక్షించాలి!

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలతో ఎగుమతులు, దిగుమతులు ఆగిపోయాయి. ఓ రకంగా ఇది మనం సంక్షోభాన్ని సరిదిద్దుకునే సమయంగా భావించాలి. ఇప్పటికే ఇబ్బడిముబ్బడిగా ధాన్యాలు దిగుమతి చేసుకుంటున్నా భారత్ ఈ దశలో వీటిపై పునరాలోచన చేయాలి. దేశీయంగా పప్పు ధాన్యాలు, నూనె ధాన్యాలు విపరీతరంగా పండుతున్నా, రైతులకు కనీస మద్దతు ధరలు చెల్లించడం లేదు. అలాగే వేసిన పంటలను కొనుగోలు చేయడం లేదు. తెలంగాణలో శనగ, మక్కజొన్నలకు డిమాండ్ లేకుండా పోయింది. శనగ కొనుగోళ్లపై స్పష్టత కరవైంది. రైతులు సాగుచేసిన శనగ పంటకు మద్దతు ధర అందించడానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై స్పష్టత కరువైంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనగ పంటను నిల్వ ఉంచుకున్న రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం ఎదురు చూస్తున్నారు. పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు తిరిగి చెల్లించడానికి ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుందని కొంతమంది రైతులు వాపోతున్నారు. ఈ దశలో దేశీయంగా ఆయా రాష్ట్రాల్లో పండుతున్న పంటలను కొనుగోలుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా ఆహార ధాన్యాలను కొనుగోలు చేసి, ప్రజలకు సరసమైన ధరల్లో అందించాలి. అదేవిధంగా దిగుమతులపై పూర్తి ఆంక్షలు విధించాలి. నూనెలు, పప్పులను దిగుమతి చేసుకోవడం తక్షణం ఆపాలి. గత కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి, గ్రామీణ ప్రాంతానికి సంబంధించి మూడు పద్దులను అంటే రూ.60 వేల కోట్ల వరకు కేంద్ర ప్రభుత్వం ఖర్చు పెట్టలేదని సమాచారం.. ఈ సంవత్సరం అందుకు భిన్నంగా జరుగుతుందని ఆశించలేం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సంవత్సరం బడ్జెట్లో ధరల స్థిరీకరణ కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. కేంద్రం ఎఫ్‌సిఐ ద్వారా వివిధ రాష్ట్రాల నుంచి కొనాల్సిన కందులు, శనగలు, పెసలు, మొక్కజొన్నలు లాంటి 25 రకాల పంటలను కొనడానికి నిరాకరించింది. దేశంలోని 24 వేల స్థానిక మార్కెట్లు, 125 ప్రత్యేక మార్కెట్ల నిర్వహణను వదిలేయడం సరైనది కాదు. నిజానికి ధాన్యం సేకరణ, తిరిగి ప్రజలకు వాటిని ఆహార ధాన్యాల రూపంలో చేరవేయడంలో పక్కా ప్రణాళిక లేకుండా పోయింది. ప్రైవేటు వ్యక్తులు కంపెనీలు, మార్కెట్లు పెట్టుకునేందుకు అనుమతించే బిల్లును గత ఫిబ్రవరిలో పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింప చేసుకుంది. గత రెండు సంవత్సరాలుగా వరి ధాన్యం, పత్తి, మిర్చి, పొగాకు, ఉల్లిపాయలు, కోకో లాంటి పంటలను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలకు కొనేవారే లేకుండా పోయారు. తక్కువ ధరలకు రైతులు అమ్ముకోవలసి వస్తున్నది. నిజానికి వ్యవసాయ విధానం సక్రమంగా ఉంటే, అనవసరపు దుబారా ఖర్చులు తగ్గించి, దేశీయంగా పంటలను ప్రోత్సహించి, ఉన్న పంటలను కొనుగోలు చేయాలి. అలాగే ప్రజలకు తక్కువ ధరలకు నిత్యాసవరాలు సరఫరా చేసే వ్యవస్థను రూపొందించాలి. దీంతో దేశంలో ఆకలి బాధతలు తగ్గడంతో పాటు, కొనుగోలు శక్తి కూడా పెరుగుతుంది. కానీ గొప్పలు చెబుతున్న బిజెపి నేతలు ఒక్కరు కూడా సమగ్ర వ్యవసాయ విధానంపై ఆలోచన చేయడం లేదు. పంటలు పండుతున్నా, సామాన్యులకు ధరలు అందడం లేదు. అలాగే ఇబ్బడి ముబ్బడిగా దిగుమతులు పెంచేస్తున్నారు. ఉన్న వ్యవసాయాన్ని నాశనం చేసే చట్టాలు చేయడం, పార్లమెంట్, అసెంబ్లీల్లో వ్యవసాయ ధరలు లేక రైతులు బాధపడుతున్నారని మొసలి కన్నీరు కార్చడం అలవాటైపోయింది. ఇకపోతే నకిలీ విత్తనాలు కూడా రైతులను నట్టేట ముంచుతున్నాయి. విత్తనాలు అమ్మిన కంపెనీలపై చర్యలు తీసుకోవడం లేదు. కంపెనీ దగ్గర కొన్న విత్తనాలు సరిగ్గా మొలవకపోయినా, తగిన దిగబడి రాకపోయినా తర్వాత వ్యవసాయ సీజన్ లోపు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని 2001 విత్తన బిల్లులో ఉంది. కానీ ఈ తాజా బిల్లు ప్రకారం కంపెనీ విత్తనాలు రెండుసార్లు మొలవకపోయినా, సరైన దిగుబడులు రాకపోయినా ఆ రైతులకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించనవసరం లేదు. మూడవసారి ఆ కంపెనీ విత్తనాలు విఫలమైతే ఆ కంపెనీ ప్రభుత్వానికి ఫెనాల్టీ చెల్లించాలని బిల్లులో ఉంది కానీ రైతులకు నష్టపరిహారం చెల్లించాలని లేదు. పంటల బీమా చట్టం' కార్పొరేట్ కంపెనీలకు ధీమా కల్పిస్తున్నది కానీ రైతులకు కాదు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఆపరేషన్ గైడ్‌లైన్స్ మాత్రం వివరంగా ఉన్నాయి. ఆచరణలో ఈ పద్దు కింద ప్రతి సంవత్సరం కేటాయించే రూ.15 వేల కోట్లలో రూ.5 వేల కోట్లు కూడా రైతులకు చేరడం లేదు. రూ.10 వేల కోట్లను కార్పొరేట్ బీమా కంపెనీలు మింగేస్తున్నాయి. వాతావరణం, క్రాప్ కటింగ్ ఎక్స్‌పరిమెంటేషన్‌లో ప్రైవేట్ కంపెనీల డేటాను వాడుతున్నారు. ప్రభుత్వ వ్యవసాయ బీమా కంపెనీలు దమ్మీలుగా మిగిలిపోతున్నాయి. ప్రైవేట్ కంపెనీదే పెత్తనం, వారే దోచేస్తున్నారు. వ్యవసాయానికి సంబంధించి పురుగు మందులలో అత్యంత దోపిడి జరుగుతున్నది. రూ.100 మందుని రూ.వెయ్యికు, రూ.300 మందును రూ.3 వేలకు అమ్ముతూ వ్యాపారస్తులు అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారు. దీనికి కారణం 'నూతన పురుగు మందుల విధానం'లో ఎం.ఆర్.పి విధానం పాటించాలని లేకపోవడమే. పురుగులను చంపడానికి ఆ ద్రావకంలో ఎంత శాతం మందు ఉండాలో అది ఉండక పోయినా వ్యాపారస్థులను అడిగేవారు లేరు. ఇలాంటి సమస్యలన్నీ చర్చించాలి. ఇందుకు తగిన సమయం ఇదే. సమగ్ర వ్యవసాయ విధానం, ఎగుమతులు దిగుమతులపై చర్చించాలి. దేశీయ పంటలను పండించుకుని తినేలా వ్యవస్థీకృత పద్ధతిని తీసుకుని రావాలి. అప్పుడే దేశం ఆర్థికంగా బలపడుతుంది. మన రైతులు ఆనందంగా ఉంటారు.

# క్యాప్ జెమినీ సీఈవో ఐమాన్ ఎజత్‌తో లోకేశ్ భేటీ

**-విశాఖలో సంస్థ ఏర్పాటుపై చర్చలు**

**-విశాఖ టిడిపి ఆఫీస్‌లో లోకేశ్ ప్రజాదర్బార్**

**విశాఖపట్నం,మార్చి12(ఆర్ఎన్ఎ):** క్యాప్ జెమిని గ్లోబల్ సిఈవో ఐమాన్ ఎజతతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖలో క్యాప్ జెమినీ సంస్థ ఏర్పాటుపై చర్చించారు. ఇప్పటికే మధురవాడ ఐటీ పార్కుల్ హిల్-1పై 20 ఎకరాల భూమిని ఈ సంస్థ కోసం పరిశీలించారు. అడివివరం, ఆనందపురం పరిధిలో రెండు చోట్ల సంస్థ ప్రతినిధులు భూములను పరిశీలించారు. తాత్కాలిక కార్యకలాపాలకు సెంట్రల్ పార్కు సమీపంలో ఓ ప్రైవేటు భవనాన్ని ఎంపిక చేశారు. అలాగే విశాఖ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఐటి సంస్థలకు అన్ని రకాలుగా అండగా ఉంటున్నామని అన్నారు. ఇకపోతే మంత్రి నారా లోకేశ్ విశాఖపట్నం జిల్లాలో గురువారం పర్యటించారు. పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 83వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. తనను కలిసేందుకు పార్టీ కార్యాలయానికి వచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులను మంత్రి ఆప్యాయంగా పలకరించారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. లోకేశ్ దృష్టికి ప్రజలు పలు సమస్యలను తీసుకువచ్చారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు అన్నివిధాలా అండగా ఉంటామని మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు.

# విచారణకు హాజరుకాని సునీల్ నాయక్

**విజయవాడ,మార్చి12 (ఆర్ఎన్ఎ):** ఉపసభాపతి రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ గురువారం నాటి విచారణకు హాజరు కాలేదు. ఈ నెల 9 వరకు విచారణకు హాజరు కావాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అయితే, విచారణ అధికారి విజ్ఞప్తి మేరకు ఈనెల 12 వరకు విచారణకు హాజరవ్వాలని స్పష్టం చేసింది. విచారణకుచివరిదైనప్పటికీ సునీల్ నాయక్ హాజరు కాకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు సునీల్ నాయక్ దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ అర్హత పిటిషన్ హైకోర్టులో విచారణకు రానుంది.

# గిరిజనులకు అభివృద్ధి అందకుండ చేస్తారా?

**-అక్కడి పనులను అడ్డుకోవడమేమిటి**

**-అటవీ అధికారుల తీరుపై మండిపడ్డ సీఎం చంద్రబాబు**

**అమరావతి,మార్చి12(ఆర్ఎన్ఎ):** ప్రభుత్వం ఆమోదించిన ఇళ్లకు కూడా ఫారెస్ట్ క్లియరెన్స్ ఇవ్వకపోవడమేంటని అటవీ అధికారులను సిఎం చంద్రబాబు ప్రశ్నించారు. గిరిజనులకు నీరు, రహదారి, విద్యుత్ వంటి కనీస సదుపాయాలు కల్పించాల్సిందేనని స్పష్టం చేశారు. కలెక్టర్ల సమావేశంలో ఫారెస్ట్ అధికారులపై చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. అభయారణ్యం పేరుతో అభివృద్ధి పనులు ఆపడం సరైనది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల్లో ప్రాథమిక సౌకర్యాలకు కూడా అడ్డంకులు సృష్టించడం తగదని పేర్కొన్నారు. పాపికొండల ప్రాంతంలో ఇళ్ల నిర్మాణం, బోర్‌వెల్స్‌కు అనుమతులు ఇవ్వకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉన్న రహదారిపై గ్రావెల్ లేదా మెటల్ వేయడానికి అభ్యంతరం చెప్పడమేంటనీ సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. అధికారుల వ్యవహార శైలిపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయంటూ హెచ్చరించారు. అధికారులు ఇప్పటికైనా మారాలని అన్నారు. సమస్యలు ఉంటే నేరుగా తనకు లేదా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు తెలియజేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు కలెక్టర్, డీఎఫ్‌వో కలిసి ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని హుకుం జారీ చేశారు. అభివృద్ధి పనులు ఆగిపోకుండా అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

# దేశంలో గ్యాస్ సంక్షోభం

**-కీలక సమావేశం నిర్వహించిన హోంశాఖ-పరిస్థితులపై అధికారుల సమీక్ష**

**న్యూఢిల్లీ,మార్చి12(ఆర్ఎన్ఎ):** పశ్చిమాసియా సంక్షోభ నేపథ్యంలో దేశంలో వంటగ్యాసు (ఎల్‌పీజీ) ఏజెన్సీల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. ముఖ్యంగా వాణిజ్య సిలిండర్లను నల్లబజారులో కొనాల్సిన పరిస్థితి తలెత్తింది. నల్లబజారులో గ్యాస్ విక్రయాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టినట్టు కేంద్రం ప్రకటించింది. ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచింది. వాణిజ్య సిలిండర్ల సరఫరాను సమీక్షించేందుకు చమురు మంత్రిత్వశాఖ ఓ కమిటీని ఏర్పాటుచేసింది. బుక్ చేసిన రెండున్నర రోజుల వ్యవధిలో గృహ వినియోగదారులకు సిలిండర్ అందజేసే విధానాన్ని కొనసాగిస్తున్నామని తెలిపింది. వంటగ్యాసు సమస్యపై కేంద్ర ప్రభుత్వం హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షతన కీలక సమావేశం నిర్వహించింది. గృహ వినియోగదారులకే అత్యధిక ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలంది. ముంబయి, దిల్లీ, బెంగళూరు సహా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు 'తాత్కాలికంగా' మూతబడటం ప్రారంభమైంది. దేశంలో చమురు, ఎల్పీజీ నిల్వలు సరిపడా ఉన్నాయని కేంద్రం చెబుతున్నప్పటికీ.. పలు ప్రాంతాల్లో కొరత ఆందోళన కలిగిస్తోంది. హోటళ్లు ప్రత్యామ్నాయ ఇంధనంపై దృష్టి సారిస్తున్నాయి. ఆలయాలు, మఠాలపై సైతం వంటగ్యాసు కొరత ప్రభావం కనిపిస్తోంది. అయోధ్యలోని ప్రసిద్ధ అమావా ఆలయంలో 'రామ్ రసోయి' అన్నదాన కేంద్రాన్ని తాత్కాలికంగా మూసివేశారు. మైక్రోవేవ్ అవెన్‌లు, ఇండక్షన్ ప్లేట్ల వాడకం ప్రారంభించాలని ఐఆర్‌సీటీసీ పశ్చిమ జోన్‌లోని కేటరింగ్ యూనిట్లను ఆదేశించింది.

## మొదటి పేజీ తరువాయి

# నీటి వినియోగంలో జాగ్రత్తలు ముఖ్యం

ఆదేశించారు. సంక్షేమ పథకాల పారదర్శకతతో అమలుకు, ఓనర్‌షిప్ తీసుకునేందుకు సంక్షేమ లేఖలు ఇవ్వాలని నిర్ణయించారు. పెట్టుబడుల గురించి ఆలోచించినట్లే... పేదల గురించి ఆలోచించాలని సూచించారు. త్వరలో సంక్షేమ క్యాలెండర్ విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి ఓ లేఖను లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. లబ్ధిదారులకు ప్రతీ నెలా ఏం లబ్ధి కలిగిందో తెలియజేయాలని సూచించారు. ఏ కుటుంబానికి ఏం లబ్ధి కలిగిందో తెలిస్తే అంతా పారదర్శకంగా ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రభుత్వం అందించే పెన్షన్, ఉచిత సిలిండర్, తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటివి లబ్ధిదారులకు తెలియాలని సూచించారు. దీపం 2.0 పథకానికి డిజిటల్ ఓచర్ జారీ చేసే అంశాన్ని పరిశీలించాలని అన్నారు. డీబీటీ పథకాల్లో ప్రోగ్రామబుల్ వోచర్లను లబ్ధిదారులకు ఇస్తే వారు వినియోగించుకుంటారన్నారు. మార్చి 9 నాటికి ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా 50.45 కోట్ల ప్రయాణాలను మహిళలు చేశారని.. రూ.1775 కోట్లను ప్రభుత్వం ఆర్టీసీకి రీయంబర్స్ చేసిందని వివరించారు. డ్వాక్రా, మెప్మా సంఘాల సేవలను వినియోగించుకుని పీ4తో సహా జీరో పావర్టీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. అన్నదాత సుఖీభవ ద్వారా రేపు మూడో విడత నిధులు విడుదల చేస్తున్నామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అన్న క్యాంటీన్ల ద్వారా 7.5 కోట్ల భోజనాలు ఇప్పటి వరకూ పేదలకు అందించగలిగామని చెప్పుకొచ్చారు. అంగన్‌వాడీ, ఆశాలకు గ్రాట్యూటీ అమలు చేస్తున్నామని అన్నారు. రూ. వెయ్యి కోట్లతో రోడ్ల మరమ్మతులు చేపట్టామని తెలిపారు. పల్లె పండుగ కింద గ్రామీణ ప్రాంతాల్లో రూ.4 వేల కోట్లు ఖర్చు చేశామని అన్నారు. సంక్షేమ పథకాలు పేదలందరికీ అందించడమే లక్ష్యంగా కలెక్టర్లు పనిచేయాలని మార్గనిర్దేశం చేశారు. సంక్షేమం, అభివృద్ధి సమతూకంగా జిల్లా కలెక్టర్లు పనిచేయాలని దిశానిర్దేశర చేశారు. ప్రతీ ఒక్కరికీ ఇంటిస్థలం లేదా ఇంటిని మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉగాదికి 2.50 లక్షల మందికి సామూహిక గృహప్రవేశాల కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ప్రతీ ఇంటికీ జేజేఎం కింద తాగునీటి కుళాయి ఇస్తామని... ప్రతి ఇంటికి ఇంటర్నెట్ అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సాలిడ్, లిక్విడ్ మేనేజ్‌మెంట్ ద్వారా గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. నెట్ జీరో కాన్సెప్టుగా ఘన వ్యర్థాలను వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు తరలించాలని ఆదేశించారు. తడి వ్యర్ధాలను కంపోస్టు తయారు చేసేందుకు మళ్లించాలని సూచించారు. 500 పాఠశాలల్లో నెట్ జీరో కాన్సెప్టులో కిచెన్ గార్డెన్, బయోడైవర్సిటీలో భాగస్వాములను చేయాలని సూచించారు. వీబీజీ రామ్ జీ కింద రూ.9773 కోట్లు ఏపీకి కేటాయించారని అన్నారు. ఇప్పుడు ఈ పథకం డిమాండ్ డ్రివెన్ కాదని.. దీనికి అనుగుణంగా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెట్టుబడుల గురించి ఎలా ఆలోచిస్తున్నామో.. పేదలకు అందించే సంక్షేమం గురించి.. వారికి కల్పించే సాధికారత గురించి కూడా కలెక్టర్లు ఆలోచించాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

# యుద్ధ డిమాండ్లను అంగీకరించాల్సిందే!

జలాల్లో రెండు ట్యాంకర్లపై 'సూసైడ్ బోటు'తో దాడి జరిగింది. ఈ ఘటనలో ఓ భారతీయుడు మృతి చెందడం గమనార్హం. పర్షియన్ గల్ఫ్‌లో ఇరాక్ తీరం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దాడికి గురైన నౌకలను అమెరికాకు చెందిన సేఫ్‌సీ విష్ణు, గ్రీస్‌కు చెందిన జెఫిరోస్‌గా గుర్తించారు. సేఫ్‌సీ విష్ణు నౌక మార్షల్ ఐలాండ్స్ జెండాతో ఉండగా.. జెఫిరోస్‌పై మాల్టా జెండా ఉంది. ఈ నౌకలు తీరంలో చమురు సేకరిస్తుండగా పేలుడు పదార్థాలతో ఉన్న 'సూసైడ్ బోటు' వీటిని ఢీకొట్టినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో భారీగా పేలుడు సంభవించి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో రెండు నౌకల్లో ఉన్న 38 మంది సిబ్బందిని రెస్క్యూ టీం సభ్యులు కాపాడారు. ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. మృతుడిని భారతీయుడిగా గుర్తించారు. అయితే, అతడి పూర్తి వివరాలు మాత్రం తెలియరాలేదు. ఈ దాడి తమ పనేనని ఇరాన్ ప్రకటించింది. ఈ మేరకు తమ అధికారిక మీడియాలో వెల్లడించింది. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధి మార్గంలో ప్రయాణించే చమురు నౌకలపై దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. బుధవారం కూడా మూడు కమర్షియల్ నౌకలపై డ్రోన్ దాడులు జరిగాయి. వీటిల్లో ఓ నౌక థాయ్ జెండాతో భారత్‌కు వస్తుండగా.. యూఏఈ తీరంలో దాడి జరిగింది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబాకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం.. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ అమెరికా డిమాండ్లకు ఒప్పుకోవాలని ట్రంప్ స్పష్టం చేశారు. న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్‌ను ఇరాన్ పూర్తిగా ఆపేయాలన్నారు. అలా జరగని పక్షంలో చావు తప్పదని హెచ్చరించారు. ఫిబ్రవరి 28వ తేదీ లాంటి దాడులు మరోసారి జరుగుతాయని చెప్పారు. ఇజ్రాయెల్ సాయంతో మొజ్తాబాను చంపేస్తామని తేల్చి చెప్పారు.

# తిరిగి స్పీకర్ స్థానంలో విధులకు ఓంబిర్లా!

ఇవ్వాలి. మైక్రోఫోన్లు ఆన్ లేక ఆఫ్ చేయడానికి స్పీకర్ వద్ద ఎలాంటి బటన్ ఉండదు. ఈ విషయం విపక్ష నేతలకు కూడా తెలుసు. మాట్లాడేందుకు అనుమతి ఉన్న సభ్యుడికి మాత్రమే మైక్రోఫోన్ ఆన్ అవుతుంది' అని తనపై విపక్షాలు కొంతకాలంగా చేస్తోన్న విమర్శలకు బిర్లా సమాధానం ఇచ్చారు. రెండ్రోజుల చర్చ అనంతరం బుధవారం సాయంత్రం విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరిగింది. మూజువాణి ఓటుతో అది వీగిపోయింది. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన భాజపా ఎంపీ నిశికాంత్ దుబెపై చర్యలు చేపట్టకపోవడం వంటి కారణాలతో విపక్షాలు ఈ అవిశ్వాస తీర్మానాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. తనపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం ప్రక్రియ పూర్తయ్యేవరకు సభకు హాజరుకాకూడదని నిర్ణయించుకున్న స్పీకర్ అది వీగిపోగానే మళ్లీ యథావిధిగా తన బాధ్యతలు చేపట్టారు.

# డిఫెన్స్ రంగంలో సరికొత్త అధ్యాయం

పూర్తి చేసి.. ప్రపంచ స్థాయి నౌకల తయారీని ఇక్కడి నుంచే ప్రారంభించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. జువ్వలదిన్నె పోర్ట్ ఆధారంగా ఈ ప్రాంతం రానున్న రోజుల్లో భారీ పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందనుంది. నెల్లూరు జిల్లాలో సాగర్ డిఫెన్స్ అటానమస్ మారిటైమ్ షిప్‌బిల్డింగ్ సిస్టమ్స్ సెంటర్‌కు శంకుస్థాపన చేయడం గర్వకారణమని మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే మొదటి కేంద్రంగా రూపుదిద్దుకోబోతున్న ఈ ప్రాజెక్టు భారతదేశ స్వదేశీ రక్షణ తయారీ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయనుందని పేర్కొన్నారు. గురువారం నెల్లూరు జిల్లాలో మంత్రి నారాయణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ప్రాజెక్టు సముద్ర సాంకేతికతలో నూతన ఆవిష్కరణలకు దారి తీస్తూ, మత్స్యకార రంగం, పారిశ్రామిక నైపుణ్యాల అభివృద్ధికి ఊతమివ్వనుందని తెలిపారు. తీర ప్రాంత పర్యవేక్షణ, భద్రత, రక్షణ సిద్ధతను మరింత బలపరచడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుందని చెప్పుకొచ్చారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును నెల్లూరు జిల్లా జువ్వలదిన్నెకు తీసుకురావటంలో కృషి చేసిన మంత్రి నారా లోకేశ్‌కు మంత్రి నారాయణ అభినందనలు తెలిపారు.

# నిరసనలను లెక్క చేయని అమెరికా అధ్యక్షుడు

శక్తిమంతమైన ఆయుధమే ఈ సెక్షన్ 301. తమ వాణిజ్య భాగస్వాములు అనుసరిస్తున్న ట్రేడ్ పాలసీలు అమెరికా వ్యాపారాలు, ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నాయా? అనేదానిపై ఈ చట్టం కింద అమెరికా దర్యాప్తు చేసేందుకు వీలు లభిస్తుంది. ఒకసారి దర్యాప్తు ప్రారంభించిన తర్వాత.. అన్యాయమైన వాణిజ్య విధానాలపై అగ్రరాజ్యం సాక్ష్యాలను సేకరించే పనిలో ఉంటుంది. ఏదైనా దేశం తమకు నష్టం కలిగించేలా ట్రేడ్ పాలసీలను అనుసరిస్తుందని తేలితే.. ప్రపంచ వాణిజ్య సంస్థ అనుమతి లేకుండానే ఆ దేశంపై ఏకపక్షంగా చర్యలు తీసుకునేందుకు ఈ చట్టం కింద అధికారం ఉంటుంది. అలాంటి దేశాలపై చట్టబద్ధంగా భారీ సుంకాలు విధించడం లేదా ప్రతీకార చర్యలు తీసుకునేందుకు అమెరికాకు మార్గం లభిస్తుంది. చైనా లాంటి ప్రత్యర్థులతో పాటు భారత్ వంటి మిత్రపక్షాల పైనా అమెరికా ఈ దర్యాప్తు చేపట్టడం చర్చకు దారితీసింది. భారత్‌లోని కొన్ని వాణిజ్య విధానాల వల్ల మన మార్కెట్లపై అమెరికాకు పరిమితులు ఉంటున్నాయని చాలాకాలంగా అగ్రరాజ్యం ఆందోళన వ్యక్తంచేస్తోంది. కొన్ని ఉత్పత్తులపై భారత్ అమలుచేస్తోన్న అధిక సుంకాలు, స్థానిక తయారీ, డేటా స్టోరేజీ, టెక్నాలజీ నిబంధనలు వంటివాటిపై అమెరికా అభ్యంతరాలు తెలుపుతోంది. ఈ అంశాల పైనే కొన్నేళ్లుగా ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్నాయి. అయితే, తాజా దర్యాప్తుతో భారత్‌పై వెంటనే పెనాల్టీలు పడే అవకాశం లేనప్పటికీ.. భవిష్యత్తులో కొన్ని రంగాలపై ఇది ప్రతికూల ప్రభావం చూపించే ప్రమాదం ఉంది. దీంతో ఆయా రంగాల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# ఆనాడు ఒక్కడినే.. నేడు కోట్లాది మందికి అండ!

అధికారంలో ఉన్నప్పటికీ ఎలాంటి భయం లేకుండా ప్రజల కోసం పోరాటం చేశా. మొదటి నుంచీ ప్రజలు, దేవుడ్నే నమ్ముకుని ముందుకు సాగా. వైసీపీ ఆవిర్భావం తర్వాత దేశ రాజకీయాల్లో కూడా మార్పులు కనిపించాయి. వైసీపీ కార్యకర్తలు ఎప్పుడూ గర్వంగా కాలర్ ఎగరేసేలా పార్టీ నిలుస్తుంది. ఈ పార్టీ కొన్ని కోట్ల మంది ప్రజలదని అన్నారు. అందరి ఆశలు, ఆకాంక్షలకు ప్రతీకగా పార్టీ నిలిచింది. పార్టీ లోపల ఎప్పుడూ విలువలు, విశ్వసనీయతకు పెద్దపీట వేస్తాం. నాపై ప్రేమాభిమానాలు చూపుతున్న కార్యకర్తలు, అభిమానులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. వైసీపీని అభిమానించే ప్రతి ఒక్కరికీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు' అని వైఎస్ జగన్ తెలిపారు. ఈరోజు మరొక్కసారి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైయస్సార్‌ను అభిమానించే ప్రతి గుండెకు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడికి, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ కూడా ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఇంకా వైయస్సార్‌ను ప్రేమించే ప్రతి గుండె, ఏ రాష్ట్రంలో ఉన్నా, ఆ ప్రతి గుండెకు ఈరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నానంటూ వైఎస్ జగన్ ప్రసంగాన్ని ముగించారు. పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నేతలు, నాయకులు, కార్యకర్తలతో పాటు పెద్ద ఎత్తున పార్టీ అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ కేంద్ర కార్యాలయానికి పెద్ద ఎత్తున అభిమానులు, కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు. వైయస్సార్ చిత్రపటానికి పూలు సమర్పించి, నివాళులర్పించిన వైఎస్ జగన్, ఆ తర్వాత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి ప్రసంగించారు.

# ఇంధన కొరత లేదు!

మాట్లాడారు. 'ఆధునిక ఇంధన చరిత్రలో ప్రపంచం ఇలాంటి క్లిష్ట సమయాన్ని మునుపెన్నడూ ఎదుర్కోలేదు. భారత్ తన ముడి చమురు అవసరాల కోసం సురక్షితమైన సరఫరాలను సమకూర్చుకుంది. హర్మూజ్ సంక్షోభంతో భారత్‌కు సంబంధం లేదు. హర్మూజ్ జలసంధి భారత్‌కు తెరిచారు. ప్రధానమంత్రి చర్చలతో పరిస్థితులు సర్దుకుంటున్నాయి' అని హర్దీప్ సింగ్ తెలిపారు. ఎలాంటి సంక్షోభం తలెత్తినా ఎదుర్కునేందుకు కూడా కేంద్రం సిద్ధంగా ఉందని చెప్పారు. డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని మంత్రి వివరించారు. సిలిండర్ల సరఫరాలో ఆసుపత్రులు, విద్యాసంస్థలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. సిలిండర్ బుకింగ్‌కు నగరాల్లో 25 రోజుల వ్యవధి, గ్రామాల్లో 45 రోజుల వ్యవధి అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఎల్ఎన్‌జీ కార్గోలు దాదాపు ప్రతిరోజూ ప్రత్యామ్నాయ సరఫరా రూట్లలో ఇండియాకు వస్తున్నాయని తెలిపారు. ఒకవేళ ఘర్షణలు సుదీర్ఘకాలం కొనసాగినప్పటికీ తగినంత గ్యాస్ ఉత్పత్తి, సరఫరా ఏర్పాట్లు చేయగలిగే స్థితిలో ఇండియా ఉందని అన్నారు. గృహాలు, పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారు. రిఫైనరీలకు తగిన ఆదేశాలు ఇవ్వడం ద్వారా గత ఐదు రోజులుగా 28 శాతం ఎల్పీజీ ఉత్పత్తి పెరిగినట్టు హర్దీప్ సింగ్ పురి తెలిపారు. లక్షలాది భారతీయ కుటుంబాల వంటిళ్లలో ఎలాంటి కొరత లేకుండా చూసేందుకు మోదీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, డొమెస్టిక్ సప్లయ్‌కు పూర్తి భరోసా ఉందని చెప్పారు. ప్రధాని మోదీ చర్చల వల్ల పరిస్థితులు సర్దుకుంటున్నాయి. పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్ సరఫరాలో ఎలాంటి కొరత లేదు. దేశీయ రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. గృహ వినియోగ సిలిండర్ల సరఫరాకు ఇబ్బందులు లేవు. 60 శాతం ఎల్‌పీజీని మనం గల్ఫ్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. సిలిండర్ల సరఫరాలో ఆస్పత్రులు, విద్యాసంస్థలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. సిలిండర్ బుకింగ్‌కు నగరాల్లో 25, గ్రామాల్లో 45 రోజుల గడువు విధించాం. ప్రపంచం ఇలాంటి ఇంధన సంక్షోభాన్ని ఎన్నడూ చూడలేదు. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ పరిస్థితి మెరుగ్గా ఉందని తెలిపారు. మంత్రి మాట్లాడుతుండగానే రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ సభ నుంచి వెళ్లిపోయారు.


**దక్షిణ రైల్వే**

**ఇ-టెండర్‌ను ఆహ్వానిస్తున్నట్లు నోటీసు**

**చెన్నై డివిజన్ (ఆపరేషన్ బ్రాంచ్)**

కస్టమ్ బిడ్ నంబర్: GEM/2026/B/7335966 భారత రాష్ట్రపతి కొరకు మరియు వారి తరపున, డివిజనల్ రైల్వే మేనేజర్ / ఆపరేషన్ బ్రాంచ్, చెన్నై డివిజన్, దక్షిణ రైల్వే, V ఫ్లోర్, NGO అనెక్స్ బిల్డింగ్, పార్క్ టౌన్, చెన్నై - 600 003 ఈ-టెండర్ పోర్టల్ WWW.GEM.GOV.IN లో అందుబాటులో ఉన్న టెండర్ నోటీసు ప్రకారం అనుభవజ్ఞులైన కాంట్రాక్టర్ల నుండి ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానిస్తుంది. చెన్నై డివిజన్‌లో ఎలక్ట్రికల్ ఆపరేషన్ పనుల కోసం ఇ-టెండర్ కోసం దరఖాస్తు చేసుకోవాలనుకునే టెండరర్(లు)/కాంట్రాక్టర్(లు) తప్పనిసరిగా ఇ-టెండర్ పోర్టల్ WWW.GEM.GOV.IN లో నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్ టెండర్లు మాత్రమే అంగీకరించబడతాయి.

| క్రమ సంఖ్య | వివరణ: | | |
|---|---|---|---|
| 1. | MAS వద్ద నాన్-AC రోడ్ వెహికల్ (SUV) ద్వారా లోకో క్రూలు / TMR ల రౌండ్-ది-క్లాక్ రవాణా: నెలకు 3600 కి.మీ. MS: నెలకు 3600 కి.మీ మరియు TVT: రెండు సంవత్సరాలకు నెలకు 6000 కి.మీ.. | | |
| పని ఖర్చు సుమారు రూ. | ధరావతు ఖర్చు రూ. | ఇ-టెండర్ ముగింపు తేదీ (సాయంత్రం నాలుగు గంటల వరకు). | పూర్తి చేయవలసిన వ్యవధి |
| 69,59,040 | 1,39,190 | 08.04.2026 | 2 సంవత్సరాలు |

బిడ్డర్లు పనుల టెండర్లకు వ్యతిరేకంగా ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ కోసం చెల్లింపులు చేయాలి, నెట్ బ్యాంకింగ్, డెబిట్/క్రెడిట్ కార్డ్ వంటి ఆన్‌లైన్ చెల్లింపు పద్ధతుల ద్వారా E-టెండర్ పోర్టల్‌లో అందుబాటులో ఉంది. E-టెండర్‌లో పాల్గొనడానికి అవసరమైన డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికేట్ పొందడం టెండరర్(లు)/కాంట్రాక్టర్(లు) బాధ్యత.

వెబ్‌సైట్ వివరాలు. WWW.GEM.GOV.IN.

నిబంధనలు మరియు షరతుల వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.

డివిజనల్ రైల్వే మేనేజర్,
(ఎలక్ట్రికల్ ఆపరేషన్ బ్రాంచ్), చెన్నై డివిజన్, చెన్నై -3

# మంచి చేయాలనే జగనన్న పార్టీ పెట్టారు!

## - వైసీపీ ఆవిర్భావ దినోత్సవంలో మోహిత్ రెడ్డి

**చంద్రగిరి, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చంద్రగిరిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ వేడుకలు గురువారం వైభంగా జరిగాయి. ప్రతి పంచాయతీలో వైసీపీ శ్రేణులు పార్టీ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. జగనన్న నాయకత్వంలో పటిష్టంగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని కూటమి పార్టీలకు తెలిసేలా చేశారు. నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ముందుగా ట్టణంలోని పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి స్థానికులు సాదర స్వాగతం పలికారు. అనంతరం పార్టీ కార్యాలయం ముందు దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఒంటి శివశంకర్ రెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి పార్టీ నాయకులతో కలసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉద్యమాల నుంచి పుట్టిన పార్టీ కనుక ఎన్ని రకాలుగా భయపెట్టాలని, ఎంత మంది ప్రయత్నించినా సరే ఆ పార్టీలో ఉన్న క్యాడర్‌ను భయపెట్టలేరన్నారు. రాజకీయాల్లో ప్రతి ఒక్కరు అధికారం కోసం పార్టీలు పెడతారని, జగనన్న మాత్రం ప్రజలకు మంచి చేయాలని, తనను నమ్ముకున్న కార్యకర్తలకు నేనున్నాను అన్న భరోసా కల్పించడం కోసం ఢిల్లీ పెద్దలు అందరూ ఏకమైనా, రాష్ట్రంలో అధికార పార్టీ వేధింపులకు గురి చేస్తున్నా ఏ మాత్రం లెక్క చేయకుండా 15 సంవత్సరాల క్రితం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని పుట్టించారన్నారు. రాజీలేని పోరాటం చేస్తూనే ఉంటామని, అందుకు జగనన్నను ఆదర్శంగా తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో యారాసి చంద్రశేఖర్ రెడ్డి, బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, మస్తాన్, మాధవరెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, అగరాల భాస్కర్ రెడ్డి, పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, సిద్ధిక్ భాష, సూరి,కోలా అనిల్, వేణుగోపాల్ రెడ్డి, ఆయా మండలాల పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గూడూరులో వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**గూడూరు, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం గూడూరు సనత్ నగర్ లోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఉమ్మడి నెల్లూరు జిల్లా ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ ఇంచార్జి మెరిగ మురళీధర్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిం చారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా పలువురు ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తొలత దివంగత సీఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మెరిగ మురళీధర్ మాట్లాడుతూ దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆశీస్సులతో వైఎస్ జగన్మోహన్ రెడ్డి పార్టీని స్థాపించి ఎన్ని వడిదుడుకులు ఉన్న పార్టీని ఎలా నిర్మించారో మరి ఎలా ముందుకు తీసుకెళ్లారు మీరందరికి తెలుసు. ఈరోజు ఎక్కడికి వెళ్ళినా జగన్మోహన్ రెడ్డి చేసిన సంక్షేమం, బాధ్యతతో పరిపాలించిన విధానం చూసిన తర్వాత ఏ పార్టీలో కూడా మాటల్లో తప్ప రూపకల్పనల్లో చేయలేదన్నారు. జగన్మోహన్ రెడ్డి ఆరోజు బడుగు బలహీన వర్గాలను, పేద ప్రజలను ఏ విధంగా సంక్షేమ పథకాలను వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అందించిందో అని తెలియజేశారు. కార్యక్రమంలో గూడూరు టౌన్, గూడూరు మండలం అధ్యక్షులు, నాయకులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీలతో డిఆర్ఓ సమావేశం

**అనంతపురం, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కలెక్టరేట్ లోని డిఆర్ఓ ఛాంబర్‌లో గురువారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో డిఆర్ఓ ఏ.మాలోల నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఇప్పటివరకు జరిగిన ఎన్నికల క్లెయిమ్స్ డిస్పోజల్, ఓటర్ మ్యాపింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ కనకరాజ్, సీనియర్ అసిస్టెంట్, బెంజిమెన్, మరియు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు నారాయణ స్వామి (టిడిపి) ఈశ్వర్ ప్రసాద్ సోమశేఖర్ రెడ్డి(వైఎస్ఆర్పిపి), ఇమామ్ వలి(ఐఎన్‌సి), బాల రంగయ్య (సిపిఐ.ఎం), అంజయ్య(బీఎస్పీ) పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండర్లపై అపోహలు వద్దు : ఆర్‌డిఓ భవాని

**పలమనేరు, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణ సమీపంలోని ఆర్డీవో కార్యాలయంలో గురువారం గ్యాస్ సిలిండర్ల ఏజెన్సీ నిర్వాహకులతో ఆర్డిఓ భవాని, తాసిల్దార్ ఇన్నా నాదం సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... గ్యాస్ సిలిండర్లా కొరత ఏర్పడిందని ధరలు భారీగా పెరిగాయని నిరాధార వార్తలను సామాజిక మాధ్యమాలలో ప్రచారం చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. యుద్ధం నేపథ్యంలో సరపర నిలిచిపోతుందని అసత్య ప్రచారాలు చేస్తే ప్రజల్లో భయాందోళనలు సృష్టించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. గ్యాస్ ఏజెన్సీల ద్వారా గ్యాస్ వినియోగదారులకు డొమెస్టిక్ సిలిండర్లు సాధారణంగానే సరఫరా కొనసాగుతుందని ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. వినియోగదారులు ఫోన్ ద్వారా సిలిండర్ కోసం ఎలా బుక్ చేసుకుంటారు. అలాగే గ్యాస్ ఏజెన్సీ వారు తమ కుటుంబం వద్దకే సిలిండర్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు. సిలిండర్ కోసం ఎవరు భయాందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. సిలిండర్లో యధావిధి గానే కొనసాగడం జరుగుతుందన్నారు

# పలమనేరులో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**పలమనేరు, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పలమనేరు చర్చి ఎదురుగా వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ, అనంతరం నాయకులు కార్యకర్తలతో కలిసి పలమనేరు మాజీ శాసనసభ్యులు డాక్టర్ వెంకటే గౌడకేక్ కట్ చేశారు. అనంతరం కార్యకర్తలకు పంచిపెట్టారు. పలమనేరు మాజీ శాసనసభ్యులు వెంకటే గౌడ మాట్లాడుతూ..... ఓడినా గెలిచినా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తోంది వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీనే అని కూటమి ప్రభుత్వం తన అసమర్థ పాలనతో ప్రజల్లోని ప్రతి వర్గంలో వ్యతిరేకత అసహ్యాన్ని మూటకట్టుకుందని..కులం మతం, ప్రాంతంతో సంబంధం లేదని, వైయస్ఆర్‌సిపి ప్రజల పార్టీ అని అందరికీ అండగా నిలవడమే మా పార్టీ అంతిమ లక్ష్యమని తెలిపారు. 2029లో జరగబోవు ఎన్నికల్లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీని గెలిపించి జగన్మోహన్ రెడ్డి ని ముఖ్యమంత్రిగా చేసుకునే బాధ్యత మనందరి పైన ఉందని, దీనికి మనందరం కంకణబద్దులై పనిచేయాలని తెలిపారు. బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో హేమంత్ కుమార్ రెడ్డి, మురళీకృష్ణ, చెంగారెడ్డి, నాగరాజ్,కమల్, శ్యామ్, సోమచంద్రారెడ్డి, ముజ్జు, హేమంత్, శ్యామ్ సుందర్ రాజ్, నరేష్, కృష్ణమూర్తి రెడ్డి, రఘునాథ్, హైదర్, సేటు, రెడ్డప్ప రెడ్డి, రమేష్ రెడ్డి, సుందరేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# అర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేయండి

**- భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లించాల్సిందే - ఇళ్లు, భూములు కోల్పోయిన వారికి పరిహారం ఇవ్వండి**

**- ఆ తరవాతే స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయాలి - సిఎం చంద్రబాబుకు సిపిఎం కార్యదర్శి లేఖ**

**అమరావతి,మార్చి12(ఆర్ఎన్ఎ):** ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయకుండా అర్సెల్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్‌కి భూమి పూజ నిర్వహించవద్దని కోరుతూ సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి లేఖ రాశారు. వైజాగ్–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలో భూసేకరణలో నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పూర్తి పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. లేఖలోని వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మార్చి 23న అర్సెల్ మిట్టల్–నిప్పన్ స్టీలు ప్లాంటుకు భూమిపూజ జరపనున్నట్లుగా మీరు ప్రకటించారు. కాని ఆ ప్రాంతంలో భూ నిర్వాసితుల సమస్యలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని మీ దృష్టికి తెస్తున్నాము. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం లో రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, చందనాడ, అమలా పురం, డి.ఎల్.పురం ఐదు పంచాయతీల పరిధిలో 11 గ్రామాల నుండి 5,500 ఎకరాల భూమి రైతుల నుండి బలవంతంగా ప్రభుత్వం సేకరించింది. ఈ సందర్భంగా నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ఇవ్వాల్సిన పరిహారం మరియు ఆర్అండ్ఆర్ ప్యాకేజీలు ఇప్పటివరకు పూర్తిగా అమలు చేయలేదు. అందులో 2,100 ఎకరాల భూమినే స్టీల్ ప్లాంటుకోసం అర్సెల్‌మిట్టల్‌కు ఇచ్చారు. కానీ న్యాయం జరగని రైతుల, కూలీల, వృత్తిదారుల సమస్యలు మీ దృష్టికి వచ్చినట్లుగా లేవు. సర్వం కోల్పోయిన నిర్వాసితులకు ఇల్లు నిర్మించుకోవడానికి సమయం ఇవ్వకుండా, ఎలాంటి సౌకర్యాలు కల్పించకుం డా ఆగమేఘాలమీద ఇళ్ళు నేలమట్టం చేసి నిర్వాసితులను నడిరోడ్డుపై నెట్టివేయడం సరైందేనా? మానవతా దృక్పథంతో ఆలోచించమని కోరుతున్నాము. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా ముందుగా భూములు కోల్పోయిన నిర్వాసితుల సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని కోరుతు న్నాము' అని లేఖలో పేర్కొన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతులు, నిర్వాసితులకు పూర్తిస్థాయి ప్యాకేజీ, పునరావాసం కల్పించాలని, ఆర్.కార్డులు ఇవ్వాలని, జిరాయితీ భూములతో సమానంగా డి–ఫారం సాగు భూములకు కూడా పూర్తిస్థాయి పరిహారం చెల్లించాలని కోరారు. డి–ఫారం భూముల్లో ఉన్న చెట్లకు చట్టం ప్రకారం నష్టపరిహారం వెంటనే చెల్లించాలని, వివాహమైన ఆడపిల్లలకు భూసేకరణ సందర్భంలో ఇచ్చిన హామీ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ప్రకారం ఇళ్లు మరియు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, 18సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ, యువకుడికి చట్టప్రకారం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు, కూలీలు, మత్స్య, కల్లుగీత కార్మికులు, గొర్రెలు–మేకల పెంపకదారులు, చేతి వృత్తిదారులు వంటి జీవనాధారం కోల్పోయిన వర్గాలను భూసేకరణ చట్టం ప్రకారం రూ.15 లక్షల ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. ఇళ్లు కోల్పోయి నిర్వాసితులైన ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ప్యాకేజీ ఇవ్వాలని, నిర్వాసితుల కాలనీలో 25 రకాల మౌలిక సదుపాయాలు పూర్తిగా కల్పించే వరకు బలవంతంగా ఖాళీ చేయించకూడదని డిమాండ్ చేశారు. చట్టప్రకారం నిర్వాసిత కాలనీలో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. భూములు కోల్పోయిన నిర్వాసిత గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుండా, నిర్వాసితుల హక్కులను అమలు చేయకుండా అర్సెల్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్‌కు భూమి పూజ నిర్వహించడం అన్యాయం మరియు చట్టవిరుద్ధమని పేర్కొన్నారు.

# హైకోర్టు ఆదేశాలను అమలు చేయండి

**పారిశుద్ధ్య కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి**

**కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో నిరసన**

**కర్నూలు,మార్చి12(ఆర్ఎన్ఎ):** మెడికల్ అండ్ హెల్త్ శాఖలో హైకోర్టు ఆదేశాలను తక్షణం అమలు చేసి అక్రమంగా తొలగించిన పారిశుద్ధ్య కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. పద్మావతి ఫెర్టిలిటీ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం సిఐటియు కర్నూలు నగర కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. నగర అధ్యక్షుడు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన నిరసన చేపట్టారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు, కెవిపిఎస్ నగర అధ్యక్షుడు రమణ మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ కళాశాలలో హాస్టల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులను ఇష్టానుసారంగా తొలగిస్తున్నారన్నారు. మహిళ కార్మికులను 50 సంవత్సరాలు పైబడిన నేపథ్యంతో తొలగించడం దుర్మార్గమన్నారు. అనంతపురం, కడప , తిరుపతి, నంద్యాల ఆస్పత్రిలో పనిచేసేటువంటి పారిశుధ్య కార్మికులను తొలగించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 62 సంవత్సరాలకు ఉద్యోగ విరమణ వయసు ఉందన్నారు. పారిశుధ్య కార్మికులను మాత్రం 50 సంవత్సరాల పేరుతో తొలగించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. రాష్ట్రంలోని ఇతర జోన్లలో ఈ సమస్య లేకపోయినా రాయలసీమ జోన్‌లో మాత్రమే ఉండటం అనుమానాలకు తావిస్తున్నదన్నారు. కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ అధికారులు వాటిని అమలు చేయక పోవడం తగదన్నారు. కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# తెనాలి జ్యువెలరీ షాపులో చోరీ

**- దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

**తెనాలి,మార్చి12(ఆర్ఎన్ఎ):** తెనాలి పట్టణం షరాఫ్ బజార్‌లోని ఒక జ్యువెలరీ షాపులో చోరీ జరిగింది. గురువారం ఉదయం జ్యువెలరీ షాపుకు వచ్చి చూసే సరికి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించిన యజమాని.. రెండో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి సీసీ కెమెరాలను పరిశీలించారు. అర్ధరాత్రి 1 గంట నుంచి 2 గంటల మధ్య గుర్తుతెలియని ఇద్దరు దుండగులు ముసుగులు ధరించి దుకాణం తాళాలు పగులగొట్టి లోపలికి వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. సంచిలో ఉన్న పది కేజీల ముడి వెండి, కౌంటర్ వద్ద ఉన్న 10 గ్రాముల బంగారు వస్తువులు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. షో కేసుల్లో ఉన్న వెండి వస్తువులు అలానే ఉన్నాయి. పోలీసులు ఘటనా స్థలికి వచ్చి వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీమ్ వచ్చి ఆధారాలు సేకరించింది. యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కాలుష్య నివారణకు చర్యలు

**- జిల్లాకు 350 ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపు**

**తిరుపతి,మార్చి12(ఆర్ఎన్ఎ):** కాలుష్య నివారణ చర్యల్లో భాగంగా జిల్లాకు 350ఎలక్ట్రిక్ బస్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించాయి. మంగళం 1, 2 డిపోలుగా విభజించి 50 చొప్పున బస్సుల నిర్వహణ బాధ్యతలను వేర్వేరు ప్రైవేట్ సంస్థలకు అప్పగించనున్నారు. తొలివిడతగా నాలుగునెలల్లో 50 ఈకా ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. వీటికి పినాకిల్ ఈ–మొబిలిటీ సంస్థ ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకుంది. తాజాగా మంగళం డిపోకే మరో 50బస్సులు కేటాయించడంతో ఆ డిపో పూర్తిగా గ్రీన్‌ఫీల్డ్‌గా మారనుంది. దాంతో బస్సుల కొనుగోలు, మౌలిక సదుపాయాల ఏర్పాట్లకు నిధుల కేటాయింపుల్లో కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం భరిస్తాయి. ఈ క్రమంలో మంగళం డిపో నిర్వహణ బాధ్యతల నుంచి ఆర్టీసీ పూర్తిగా విరమించుకున్నట్లే. కాగా మంగళం డిపోలో ఎలక్ట్రిక్ బస్సు రీచార్జింగ్ స్టేషన్ కోసం రూ.7.6 కోట్లు కేటాయించినట్లు తెలుస్తోంది. ఎస్పీడీసీఎల్ సంస్థ అండర్‌కేబుల్, ట్రాన్స్‌ఫార్మర్ వంటి పనులను మొదలుపెట్టనుంది. అదే విధంగా ప్రాంగణంలో సివిల్‌వర్క్, చార్జింగ్ మిషన్‌ల అమరిక వంటి మౌలిక వసతులకు రూ.6.3 కోట్లు కేటాయించారు. పనుల టెండర్ ప్రక్రియ ఈ నెల్లోనే పూర్తికానుంది.

# తిరుమలలో అరుదైన పచ్చనాగు పాము ప్రత్యక్షం

**తిరుమల,మార్చి12(ఆర్ఎన్ఎ):** తిరుమలలో అరుదైన పచ్చ నాగుపాము కనిపించింది. సాధారణంగా నాగుపాములు బూడిద రంగులో ఉంటాయి. అయితే తిరుమలలో మాత్రం బుధవారం సాయంత్రం పచ్చ రంగులో ఉన్న నాగుపాము ప్రత్యక్షమై అందరినీ ఆశ్చర్యపరిచింది. రెండడుగుల పొడవు మాత్రమే ఉన్న ఈ పాము సాధారణ నాగుపాముల తరహాలోనే పడగతో కనిపించగా అక్కడి సిబ్బంది పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కరనాయుడికి సమాచారమిచ్చారు. వెంటనే ఆయన అక్కడికి చేరుకుని పామును పట్టుకుని దట్టమైన అడవిలో విడిచిపెట్టాడు. ఈ అరుదైన పాము నాగుపాము జాతికి సంబంధించినదేనని, అత్యంత విషపూరితమైనదని భాస్కర నాయుడు తెలిపారు.

# ఇరాన్‌పై వెంటనే యుద్ధాన్ని ఆపాలి

**- అమెరికా తీరుకు వ్యతిరేకంగా లెఫ్ట్ ర్యాలీ**

**విజయవాడ,మార్చి12(ఆర్ఎన్ఎ):** అమెరికా, ఇజ్రాయిల్ సామ్రాజ్యవాదం నశించాలని కోరుతూ లెఫ్ట్ పార్టీలు విజయవాడలో ర్యాలీ నిర్వహించాయి. ఇరాన్‌పై చేస్తున్న యుద్ధాన్ని తక్షణమే ఆపేయాలని, డిమాండ్ చేశాయి. అమెరికా దుందుడుకు ,నిరంకుశ విధానాలతో ప్రపంచం యావత్తూ తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. అమెరికా నిరంకుశ విధానాలను నశించాలంచాలంటూ నినాదాలు చేశారు. ప్రజలు, కార్మికులు, రైతుల ప్రయోజనాలు కాపాడాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆధ్వర్యాన గురువారం విజయవాడలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ శాంతి వర్ధిల్లాలి..అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి.. యుద్ధం వద్దు.. శాంతి ముద్దు అని నినదించారు. ఈ ర్యాలీలో ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని ప్రదర్శన నిర్వహించారు.

# టూవీలర్‌ను ఢీకొన్న కారు: వ్యక్తి మృతి

**విజయవాడ,మార్చి12(ఆర్ఎన్ఎ):** ఎన్టీఆర్ జిల్లా మైలవరం ఎన్నెస్పీ కాలనీ వద్ద జాతీయ రహదారిపై కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనదారుడు చాట్ల వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందగా.. కారు రహదారి పక్కన ఉన్న ఓ దుకాణంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో దుకాణం వద్ద ఉన్న ఇద్దరు గాయపడగా.. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను మైలవరం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల కొరతపై మోదీ మౌనం

**పార్లమెంటులో చర్చించాలన్న ఎంపి చామల**

**న్యూఢిల్లీ,మార్చి12(ఆర్ఎన్ఎ):** ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల కొరతపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎందుకు మాట్లాడటం లేదని కాంగ్రెస్ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. పశ్చిమాసియా దేశాల్లో జరుగుతున్న యుద్ధంపై పార్లమెంట్‌లో ఎందుకు చర్చించడం లేదని నిలదీశారు. ఎల్పీజీ సమస్యను కేంద్రప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. 18వ లోక్‌సభలో కేంద్రప్రభుత్వం వాస్తవాలు మాట్లాడనీయడం లేదని ధ్వజమెత్తారు. ప్రతిపక్షాల గొంతు నొక్కడం మోదీ ప్రభుత్వ అజెండాగా మారిందని ఆగ్రహించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడే మాటలను నరేంద్రమోదీ మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.

# హర్మోజ్ జలసంధి మూసే ఉంచుతాం

**- అమెరికాపై ప్రతీకార దాడులు ఆగవు - పొరుగుదేశాలు అమెరికా స్థావరాలు మూసేయాలి**

**- ఇరాన్ కొత్తనేత మొజ్తబా ఖమేనీ తొలి ప్రకటన - ప్రసారం చేసిన ఇరాన్ టెలివిజన్**



**టెహ్రాన్,మార్చి12(ఆర్ఎన్ఎ):** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చిన వేళ ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ సంచలన ప్రకటన విడుదల చేశారు. హోర్ముజ్ జలసంధిని మూసే ఉంచుతామని అన్నారు. హోర్ముజ్ జలసంధి మూసివేతను తన తండ్రి అయతొల్లా అల్ ఖమేనీ హత్యకు ప్రతీకారంగా అమెరికా–ఇజ్రాయెల్‌పై ఒత్తిడి పెంచే చర్యగా అభివర్ణించారు. ఆయన ప్రకటనను ఇరాన్ టెలివిజన్ ప్రసారం చేసింది. మొజ్తాబా మాత్రం కెమెరా ముందుకు రాలేదు. ఇరాన్ సుప్రీం నేతగా ఎన్నికైన తర్వాత ఆయన అధికారిక ప్రకటన విడుదల చేయడం ఇదే మొదటిసారి. మధ్యప్రాచ్యంలో శత్రులక్ష్యాలపై దాడులు కొనసాగిస్తామని కూడా మొజ్తాబా హెచ్చరించారు. అమెరికా స్థావరాలను మూసివేయాలని ఆయా దేశాలకు పిలుపునిచ్చారు. లేనిపక్షంలో దాడులు కొనసాగుతాయని హెచ్చరించారు. అమెరికా–ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ ప్రజలు చిందించిన రక్తం, ముఖ్యంగా మినాబ్‌లో జరిగిన పాఠశాల బాంబు దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల త్యాగాలకు ప్రతీకారం తీర్చుకునే విషయంలో వెనుకంజ వేసేది లేదన్నారు. యుద్ధంలో శత్రువులు కలిగించిన నష్టానికి ఇరాన్ పరిహారం కోరుతోందని మొజ్తాబా అన్నారు. పరిహారం చెల్లించని పక్షంలో అంతే మొత్తాన్ని వాళ్ల ఆస్తుల నుంచి తీసుకుంటుందని, అది సాధ్యం కాకుంటే అంతే మొత్తంలో ఆస్తులకు నష్టం కలిగిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుత కష్టకాలంలో దేశంలోని ప్రజలు, సంస్థలు కలిసికట్టుగా ఉండాలని, అమెరికా చెబుతున్న అబద్దాలను తిప్పికొట్టాలని, జాతీయ సమైక్యతను చాటుకోవాలని కోరారు. ఇరాన్ అమరవీరుల ప్రతీకారం తీర్చుకుంటామని మెజ్తాబా ఖమేనీ ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రాంతంలోని అమెరికా స్థావరాలను మూసివేయాలని పిలుపునిచ్చారు.గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న సంఘర్షణ నేపథ్యంలో అమెరికా, హోర్ముజ్ జలసంధిపై కఠినమైన వైఖరిని ప్రస్తావించారు. 'ఈ ప్రాంతంలోని అన్ని అమెరికా స్థావరాలను వెంటనే మూసివేయాలి, లేకపోతే వాటిపై దాడి కొనసాగుతుంది' అని హెచ్చరించారు. కాగా, దాడుల్లో గాయపడి ఇప్పటి వరకు బయటకు కనిపించని సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ప్రకటనను ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్‌లో ఒక ప్రెజెంటర్ వినిపించారు. హోర్ముజ్ జలసంధి మూసివేత కొనసాగించాలని ఒక లెవరేజ్ సాధనంగా అది ఉండాలని ఆయన అన్నారు. పొరుగు దేశాల పట్ల ఇరాన్ విధానం సహకారంగా ఉంటుందని చెప్పడానికి ప్రయత్నించారు. 'ప్రాంతీయ దేశాలతో స్నేహపూర్వక సంబంధాలకు ఇరాన్ మద్దతు ఇస్తుంది. కానీ అమెరికన్ దళాలకు ఆతిథ్యం ఇవ్వకుండా వారిని హెచ్చరిస్తుంది' అని పేర్కొన్నారు.మరోవైపు ఇరానియన్ల రక్తానికి ప్రతీకారం తీర్చుకోవడానికి తాము వెనుకాడబోమని మొజ్తాబా ఖమేనీ స్పష్టం చేశారు. స్కూల్‌పై క్షిపణి దాడిలో సుమారు 110 మంది పిల్లలతో సహా168 మంది మరణించిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ పోరాటాన్ని ఆయన ప్రశంసించారు. అలాగే లెబనాన్, ఇరాక్, యెమెన్‌తో సహా ఈ ప్రాంతంలోని మిత్ర సాయుధ సమూహాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ హతమయ్యారు. ఈ దాడుల్లో గాయపడిన ఆయన కుమారుడైన మొజ్తాబా ఖమేనీ తన తండ్రి అధికారాన్ని దక్కించుకున్నారు.

## 10వ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు వితరణ

**పలమనేరు,మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రూరల్ మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీ జడ్పీ హై స్కూల్లో 10వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులకు జనసేన పార్టీ రూరల్ మండలం ప్రధాన కార్యదర్శి లోకనాథ్ ఆధ్వర్యంలో పలమనేరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ పసుపులేటి దిలీప్,మండల ఇంచార్జ్ నాగరాజు మోతుకూరు వారి చేతుల మీదుగా విద్యార్థులకు ప్యాడ్లు, పెన్స్, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎంసి వైస్ చైర్మన్ పసుపులేటి దిలీప్ మాట్లాడుతూ.. పదవ తరగతి విద్యార్థులకు జరగబోయే పరీక్షలకు ఈ ప్యాడ్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అదేవిధంగా విద్యార్థులు బాగా చదువుకొని అత్యధిక మార్కులు సాధించాలని వారు సూచించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు మాధవ, పెద్దపంజాణి మండలం ఇంచార్జ్ శివ కుమార్, జనసేన పార్టీ నాయకులు రమేష్, సోమశేఖర్, మణి, నగేష్, నాగభూషణం, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌పై విజయం.. హెచ్.పి.వి. టీకాతో సాధ్యం

**పులిచెర్ల,మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మహిళల్లో అధికంగా కనిపించే క్యాన్సర్లలో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ ఒకటని, దీనిపై విజయం సాధించాలంటే ప్రజల్లో అవగాహన పెంచడం, హెచ్.పి.వి. టీకాతోనే సాధ్యమని పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్.పి.వి. టీకా కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా బాలికలు, వారి తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ క్యాన్సర్‌కు ప్రధాన కారణం 'హ్యూమన్ పాపిలోమా వైరస్' అని తెలిపారు. ఈ వైరస్ నుంచి రక్షణ పొందేందుకు టీకా అత్యంత ప్రభావ వంతమైనదని, ప్రభుత్వ మార్గనిర్దేశకాల ననుసరించి ప్రస్తుతం 14 సంవత్సరాలు పూర్తయి ఇంకా 15వ పుట్టినరోజు జరుపుకోని బాలికలకు ఈ టీకాను వేస్తున్నామని, దీని ద్వారా భవిష్యత్తులో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చునని తెలిపారు. హెచ్.పి.వి. టీకా సురక్షితమైనదని, తల్లిదండ్రులు తమ కుమార్తెల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఖరీదైన టీకాను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న విషయం గుర్తించి ముందుకువచ్చి బాలికలకు టీకా వేయించాలని విజ్ఞప్తి చేశారు కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ అపర్ణ, పబ్లిక్ హెల్త్ నర్స్ శ్రీదేవి, ఆరోగ్య పర్యవేక్షకులు పురుషోత్తం మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరానికి స్పందన

**పలమనేరు, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రపంచ మూత్రపిండాల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పలమనేరు బ్రాంచ్ ఆధ్వర్యంలో, సాయి హెల్త్ కేర్ అండ్ డైగ్నోసిస్ సెంటర్ సహకారంతో గురువారం పలమనేరు పట్టణంలోని మదనపల్లె రోడ్డులో ఉన్న సాయి హెల్త్ కేర్ అండ్ డయాగ్నోసిస్ సెంటర్‌లో ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐ.ఎం.ఏ పలమనేరు బ్రాంచ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఈ.యుగంధర్, సాయి హెల్త్ కేర్ అండ్ డయాగ్నోసిస్ సెంటర్ డాక్టర్ పి.రాజారెడ్డి సంయుక్తంగా నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. సుమారు 40 మంది ప్రజలు ఈ శిబిరంలో పాల్గొని తమ ఆరోగ్య పరిస్థితులను పరీక్షించి చుకున్నారు. శిబిరంలో భాగంగా రక్తంలో చక్కెర పరీక్షలు(ఎఫ్. బి.ఎస్/రాబ్స్), మూత్ర పరీక్షలు(ఉరినే రొటీన్), సీరమ్ క్రియాటినిన్, సీరమ్ యూరిక్ ఆమ్లం పరీక్షలు, రక్తపోటు పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు డా.ఇ.యుగంధర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం జీవనశైలి లో మార్పులు, ఆహారపు అలవాట్లు, షుగర్, బీపీ వంటి సమస్యల కారణంగా మూత్రపిండాల వ్యాధులు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి నివారించవచ్చని సూచించారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయి. భవిష్యత్తులో కూడా ప్రజల ఆరోగ్యం కోసం మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాయి హెల్త్ కేర్ అండ్ డైగ్నోసిస్ సెంటర్ వైద్య సిబ్బంది, స్థానికులు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**కందుకూరు, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని పెద్ద బజార్ నందు అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు గురువారం ఉదయం ప్రారంభించారు. మొదట పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్యవైశ్యులందరూ కలిసి వేసవికాలం సందర్భంగా అమరజీవి విగ్రహం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేయడం మంచి కార్యక్రమం అన్నారు. ఆర్యవైశ్యులకు ఏ అవసరం వచ్చినా తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయి. త్వరలోనే పెద్ద బజారు, బ్యాంకు బజారు రోడ్లను అభివృద్ధి నిధులు కేటాయించాం పనులు మొదలవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఆర్టీసీడిపో పక్కనున్న శ్మశానంలో అంతిమ సంస్కారాల కోసం ఎలక్ట్రికల్ పరికరాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేశారు. శ్మశానం అభివృద్ధికి అభివృద్ధికి సహకరించేందుకు VPG జువెలర్స్ యజమాని వేముల సుకుమార్ గుప్తా ముందుకు రాగా ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.అనూష, పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, ఆర్యవైశ్య నాయకులు మురారిశెట్టి సుధీర్, డాక్టర్ తన్నీరు మల్లికార్జునరావు, ఆర్యవైశ్య మీడియా ఛైర్మెన్ చక్కా వెంకట కేశవరావు, చీదెళ్ళ వేణుగోపాలరావు, కాకుమాని ప్రవీణ్ కుమార్, కంకణాల వెంకటేశ్వర్లు, కోట వెంకట నరసింహం, తాతా లక్ష్మీనారాయణ, ఇస్కాల మధుసూదన్ రావు, పబ్బిశెట్టి వరదరాజ, గుర్రం చిన అల్లూరయ్య, రవ్వా శ్రీనివాసులు, ఇమ్మడిశెట్టి సుబ్బరాయుడు, తటవర్తి శివ, చీదెళ్ల కృష్ణ, దేసు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచం మొత్తం సీమ వైపు చూసేలా హార్టికల్చర్ హబ్

### - సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి

**అనంతపురం, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రపంచం మొత్తం రాయలసీమ వైపు చూసే విధంగా గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా మార్చబోతున్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. 26వ విడుతలో భాగంగా మొత్తం 35 మందికి రూ.30 లక్షల 92 వేల విలువచేసే చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ టీడీపీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు సీఎంతో పాటు ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ ఇప్పటివరకు అర్బన్ నియోజకవర్గంలోనే ఐదున్నర కోట్ల రూపాయలు సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించామన్నారు. ఇందులో సగానికి పైగా మైనార్టీలకు సాయం అందిందన్నారు. రాష్ట్రం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పటికీ కూడా పేదల ఆరోగ్యం విషయంలో ముఖ్యమంత్రి ఎంత ఖర్చైనా చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే కాకుండా అనంతపురం జిల్లాకు అత్యంత కీలకమైన హంద్రీనీవా కాలువను రికార్డ్ సమయంలో వెడల్పు చేసి శ్రీశైలం నుంచి ఈసారి 50 టీఎంసీల నీటిని తీసుకున్నామన్నారు. ముఖ్యంగా రాయలసీమను ప్రపంచంలోనే ఒక ప్రత్యేక గుర్తింపు వచ్చే విధంగా లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా మార్చబోతున్నారని.. ఇది రాయలసీమపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉన్న ప్రేమకు నిదర్శనమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని లక్షలాదిమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. అర్బన్ నియోజకవర్గంలో ఇప్పటికే రూ.130 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని.. ఇటీవల అసెంబ్లీలో మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి మరింత నిధులకు ఆమోదం లభించిందని.. త్వరలోనే ఈ పనులు కూడా చేపడుతామని ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, కార్పొరేషన్ డైరెక్టర్లు పిఎల్ఎన్ మూర్తి, పోతుల లక్ష్మీనరసింహులు, క్లస్టర్ ఇంచార్జ్‌లు కాయగూరల శ్రీధర్, గోపాల్ గౌడ్, టిడిపి జిల్లా కార్యదర్శి కంఠాదేవి టిడిపి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఐరాల మండలంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ఐరాల, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలంలో వైఎస్ఆర్సిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండల వైఎస్ఆర్ సీపీ కన్వీనర్ బుజ్జి రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించడం జరిగింది. మొదటగా ఐరాల మండలం వైఎస్ గేట్ నందు పార్టీ జెండా ఆవిష్కరించి తదుపరి కేక్ కటింగ్ చేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ప్రారంభించారు. తర్వాత మండల కేంద్రంలోని జెండా మాను దగ్గర వైఎస్ఆర్సిపి జెండా ఎగురవేసి కేక్ కట్ చేసి నాయకులు పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తర్వాత పాటూరులో కూడా జెండా ఆవిష్కరించి భారీ ఎత్తున కేక్ కటింగ్ చేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మండలం వైఎస్ఆర్సిపి కన్వీనర్ బుజ్జి రెడ్డి మాట్లాడుతూ దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి మరణించిన తర్వాత ఆంధ్ర రాష్ట్రం దిక్కు తోచని స్థితిలో ఉన్నప్పుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపించి నేటికి 16 సంవత్సరాలు పూర్తి అయిందని తెలియజేశారు. అలాగే జగన్మోహన్ రెడ్డి అందించిన సుపరిపాలన దృష్టిలో పెట్టుకొని అందరూ ఏకతాటిపై ఉండి రాబోయే సాధారణ ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని మరొకసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మోహన్, వైస్ ఎంపీపీలు రోజా ప్రభాకర్ రెడ్డి, నిత్య సురేష్ రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు ప్రతాపరెడ్డి, వినయ్ కుమార్ రెడ్డి, కణతం చంద్రశేఖర్, టెరిణ్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, భాస్కరయ్య, ఉమాపతి రెడ్డి, రామచంద్ర, దొరబాబు, రమణ, గోపి సాగర్, శేషాద్రి, ధనంజయ, ఐరాల మండలంలోని వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తులో పాల్గొని వైఎస్ఆర్సిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.

## ఘనంగా వైసీపీ 16వ ఆవిర్భావ వేడుకలు

**రామసముద్రం,మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని స్టేట్ బీసీ జనరల్ సెక్రటరీ గెవన్న నివాసం వద్ద మండల వైసీపీ అధ్యక్షుడు కేశవరెడ్డి, ఎంపీపీ రమణారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలు, ప్రజల పట్ల ఆయన చూపిన సేవాభావం ప్రతి వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తకు ఆదర్శమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత నవరత్నాల పేరుతో పలు సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. పార్టీ మరింత బలోపేతం కావాలంటే నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఈనెల 16 నుంచి గాలికుంటు టీకాలు

**రామసముద్రం, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలంలోని గ్రామాల్లో పాడి పశువులను గాలికుంటు వ్యాధి నుంచి రక్షించేందుకు ఈ నెల 16 నుంచి ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పశువైద్యాధికారి పావని తెలిపారు. మండలంలో సుమారు 13 వేల పశువులు ఉండగా, వాటికి ప్రభుత్వం తరపున ఉచితంగా టీకాలు వేయనున్నట్లు చెప్పారు. మండలం కర్ణాటక సరిహద్దుకు సమీపంలో ఉండటంతో మేత కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే పశువుల ద్వారా గాలికుంటు వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ వ్యాధి సోకిన పశువుల నోటిలో పుండ్లు ఏర్పడటం, కాలిగిట్టల్లో గాయాలు రావడం, చెత్తలు పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. రైతులు పశువైద్య సిబ్బందికి సహకరించి టీకా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## కార్మికులకు రెగ్యులర్‌గా హెల్త్ క్యాంప్

**పలమనేరు, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పురపాలక సంఘ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు యూపిహెచ్‌సి డాక్టర్ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. నారి లీడ్స్ స్వచ్ఛత ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ శిరీష, యూపీహెచ్సీ డాక్టర్ కుమారి, చందన ప్రియ, సబ్ యూనిట్ అధికారి జయశంకర్, మున్సిపల్ కార్మికులు వార్డు సచివాలయ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

## జూదరులకు డీఎస్పీ కౌన్సిలింగ్

**కందుకూరు, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** డిఎస్పీ కందుకూరు సబ్ డివిజన్‌లో గల 9 పోలీస్ స్టేషన్ల లోని పేకాట , కోడి పందేలు ఆడే పాత ముద్దాయిలను డిఎస్పీ ఆఫీసు నందు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా సబ్ డివిజన్ పరిధిలో పేకాట గాని లేదా కోడి పంద్యాలు గానీ ఆడినా, నిర్వహించినా కేసులు నమోదు చేసి జైలుకు పంపించడం జరుగుతుందన్నారు. అంతే కాకుండా వారిపై రౌడీ షీట్లు ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. పాత ముద్దాయిలపై, పేకాట, కోడి పంద్యాలపై నిరంతరంగా నిఘా పెట్టామని, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కౌన్సెలింగ్ నందు సీఐ, కందుకూరు, కందుకూరు టౌన్, ఉలవపాడు, లింగసముద్రం, వీవీ పాలెం, కొండపి, మర్రిపూడి, పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు పాల్గొన్నారు.

# చిత్తూరు జిల్లా

## అపోలో కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు

**చిత్తూరు, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మురకంబట్టులోని ది అపోలో యూనివర్సిటీ పరిధిలోని అపోలో కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో ఫ్రెషర్స్ డే (కాలేజ్ డే) వేడుకలు గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కొత్తగా చేరిన విద్యార్థులను ఆత్మీయంగా ఆహ్వానిస్తూ, వారి ప్రతిభను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. అధ్యాపకులు, విద్యార్థులు, అతిథులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలకు ప్రత్యేక శోభ తీసుకొచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన ట్రెయిన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ బ్రాంచ్ అధ్యక్షురాలు డి.ఉషా పన్నగ వేణి మాట్లాడుతూ, నర్సింగ్ వృత్తి సమాజానికి అత్యంత అవసరమైన సేవా రంగమని పేర్కొన్నారు. నర్సింగ్ విద్యార్థులు కేవలం నైపుణ్యంతోనే కాకుండా సేవాభావం, కరుణ, బాధ్యతతో కూడిన మనసును పెంపొందించుకోవాలని సూచించారు. అపోలో వంటి అత్యున్నత నర్సింగ్ విద్యాసంస్థలో చదువుతున్న విద్యార్థులు భవిష్యత్తులో ఉత్తమ నర్సింగ్ నిపుణులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. సాధారణంగా ఆరు నుంచి ఏడు మందికి ఒక నర్సు ఉండాల్సి ఉండగా, భారత్‌లో దాదాపు 300 మందికి ఒక నర్సు కూడా లేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్ అప్రైడ్ జె. అగస్టీన్, అపోసియేట్ డీన్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్, నర్సింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జింటో మాథ్యూ, అరగొండ అపోలో నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. లోకేశ్వరి, వేలూరు సిఎంసి కాలేజీ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ నిర్మలా మార్గరెట్ పి తదితరులు పాల్గొన్నారు. కొత్తగా చేరిన విద్యార్థులు కలసికట్టుగా కార్యక్రమానికి ప్రదర్శనగా రావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, వినోదాత్మక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కొత్త విద్యార్థుల ఉత్సాహంతో సాగిన ఈ ఫ్రెషర్స్ డే వేడుకలు కళాశాల ప్రాంగణంలో సందడి వాతావరణాన్ని సృష్టించాయి.

## 14 ఏళ్ల బాలికలకు హెచ్పివి వాక్సిన్ వేయించాలి

**పెద్దపంజాణి, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కొందరూ బాలికలకు పిహెచ్‌సిలో గురువారం వాక్సిన్‌లు వేసారు. అలాగే మండలంలో ఉన్న 14 ఏళ్ల బాలికలకు హెచ్‌పివి వాక్సిను తప్పకవేయించాలని వైద్యాధికారి డా॥మురళి కోరారు. ఈ రోజు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల్లో గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ రాకుండా ఉండేందుకు ఈటీకాలను ఉచితంగా వేస్తున్నట్లు తెలిపారు. ఈటీకా వేసుకున్నాక కొంతమందికి తేలికపాటి జ్వరం, వొంటినొప్పులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ లక్షణాలు రెండు మూడు రోజుల్లో తగ్గిపోతాయన్నారు. టీకాలు వేయించుకున్న బాలికలకు సర్టిఫికెట్ సైతం కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. మండలంలో ఉన్న 14 ఏళ్ల లోపు బాలికలు ఈఅవకాశాన్ని సద్వి నియోగంచేసుకోవాలని, తల్లిదండ్రులు కూడా తమబాలికలకు తప్పక టీకాలు వేయించాలని ఆయన కోరారు.

## డిప్యూటీ సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

### - జనసేన పార్టీ సీనియర్ నాయకులు రాయల్ గణి ఆగ్రహం

**మదనపల్లె, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని పట్టణానికి చెందిన జనసేన పార్టీ సీనియర్ నాయకులు రాయల్ గణి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కోనసీమ జిల్లా గుమ్మడివరంకు చెందిన ఫాస్టర్ బాలు సనాతన ధర్మం కోసం పోరాడుతున్న పవన్ కళ్యాణ్ గురించి అసభ్యకరంగా మాట్లాడడం సమంజసం కాదన్నారు. జనసేన అధినేత అన్నిమతాల వారిని ఎంతో గౌరవిస్తారని, అటువంటి వ్యక్తిపై పాస్టర్ బాలు ఇటువంటి వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.పాస్టర్ అంటే దైవ సందేశాలు ఇచ్చేవారని, ఇలా మత విద్వేషాలను రెచ్చగొట్టే వారు కాదని హితవు పలికారు. తనకు మదనపల్లెలో చిన్నప్పటి నుండి క్రిస్టియన్లు,క్రిస్టియన్ పాస్టర్లు స్నేహితులుగా ఉన్నారని వారు ఎంతో హుందాగా వ్యవహరిస్తారని కొనియాడారు. ఇప్పటికైనా క్రిస్టియన్ మత పెద్దలు ఆలోచించి బాలును పాస్టర్ విధుల నుంచి తప్పించాలని విజ్ఞప్తి చేశారు. పవన్ కళ్యాణ్ కు అండగా జన సైన్యం ఉందని ఇది గుర్తించుకోవాలని, మరోసారి ఇటువంటి వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే పరమావధిగా అడుగులు

### - వైఎస్ఆర్‌సీపీ ప్రస్థానం ఎంతో ప్రత్యేకం

### - వైసీపీ ఆవిర్భావ వేడుకల్లో అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజాసంక్షేమమే పరమావధిగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అడుగులు వేస్తుందని వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. అనంతపురంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో గురువారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను అనంత వెంకటరామిరెడ్డి ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. అంతకుముందు దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ వైఎస్ఆర్ మరణం తర్వాత ఏర్పడిన ప్రత్యేక పరిస్థితుల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందని తెలిపారు. వైఎస్ఆర్ ఆశయాలు కొనసాగించాలన్న ఆకాంక్షతో పేద, బడుగు, బలహీన వర్గాలకు మేలు చేయాలన్న సంకల్పంతో వైసీపీ అడుగులు వేసిందని తెలిపారు. ప్రతిపక్ష నేతగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై వైఎస్ జగన్ అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. 3648 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర చేసి జనంతో మమేకమై వారి కష్టాలు తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. అధికారంలోకి రాగానే ఐదేళ్లలో ప్రజారంజక పాలన అందించారని తెలిపారు. కోవిడ్ వంటి పరిస్థితులు ఉన్నా ఎక్కడా సంక్షేమ పథకాలు ఆపలేదన్నారు. గత ఎన్నికల్లో ఓడిపోయినా వైసీపీకి 45 శాతం ఓట్లు వచ్చాయని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వంలో తప్పుడు కేసులు పెడుతున్నారని, దౌర్జన్యపరులు విజృంభిస్తున్నారని విమర్శించారు. అనంతపురం వంటి ప్రాంతంలో ప్రజాప్రతినిధుల అవినీతి పెరిగిపోయిందన్నారు. అధికార పార్టీ చేస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఎవరూ భయపడొద్దని.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ముందుకెళ్దామన్నారు. దుష్ట, దౌర్జన్య ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

# ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

**కలికిరి,మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ కుమార్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు షేక్ హనీఫ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్ హాజరయ్యారు. స్థానిక బస్టాండ్ ఎదురుగా గల దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాల సాధనకు ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్థాపించారని అన్నారు. పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పార్టీని అధికారంలోకి తెచ్చి పేదల సంక్షేమం రాష్ట్ర అభివృద్ధికి పాటు పడిన వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో రత్న శేఖర్ రెడ్డి, మధు రెడ్డి, శివాజీ, ఎస్టిడి హరి, సమీవుల్లా, ఇంతియాజ్, షమన్ షా, జావీద్, సుబహాన్, జాకీర్ ఆఫ్రీద్, నరేష్, యుగంధర్ ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మిట్స్ వర్సిటీలో ఫుల్ స్టాక్ అప్లికేషన్ డెవలప్మెంట్‌పై వర్క్ షాప్

## -ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సజ్జ తులసి క్రిష్ణ

**మదనపల్లె/ కురబలకోట,మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్) విభాగం వారు మిట్స్ ఐ.ఎస్.టి.ఈ స్టూడెంట్స్ చాప్టర్ వారి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఫుల్ స్టాక్ అప్లికేషన్ డెవలప్మెంట్ అంశంపై వర్కుషాప్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు లోని కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్‌లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం నందు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సజ్జ తులసి క్రిష్ణ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ అనేది ఒక ఇంటర్నెట్ అప్లికేషన్‌లో ఫ్రంట్‌ఎండ్ యూజర్ చూసే భాగం, బ్యాక్‌ఎండ్‌లో డేటాబేస్, సర్వర్, లాజిక్ వంటి రంగాలలోనూ పనిచేయగల సాంకేతికత అని తెలిపారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఈ నైపుణ్యానికి భారీ డిమాండ్ పెరగడం ద్వారా ఫుల్ స్టాక్ డెవలపర్లు ఫ్రంట్‌ఎండ్, బ్యాక్‌ఎండ్ రెండింటినీ నిర్వహించగలగడం వల్ల టీమ్‌పై ఆధారపడటం తగ్గి, ప్రాజెక్ట్ నిర్వహణ వేగంగా పెరుగుతోందని అన్నారు. విద్యార్థులకు ఎండ్-టు-ఎండ్ ప్రాజెక్ట్ అవగాహన ఉండటం వల్ల ఒక అప్లికేషన్ ఎలా రూపుదిద్దుకుంటుంది, డేటా ఎలా ప్రాసెస్ అవుతుంది, యూజర్‌కు ఎలా కనిపిస్తుంది అన్నది పూర్తిగా అర్థం అవుతుందన్నారు. ఐటి రంగంలో కెరీర్ నిర్మించాలనుకునే విద్యార్థులు ఈ నైపుణ్యాన్ని తప్పనిసరిగా అలవర్చుకోవడం చాలా ముఖ్యమని సూచనలు చేశారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ ఆర్.కల్పనా, కోఆర్డినేటర్ కె.మొహమ్మద్, డాక్టర్ చొక్కనాథన్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్మార్ట్ కిచెన్‌లను నెల లోపు పూర్తి చేస్తాం: కలెక్టర్ శ్రీధర్

**కడప,మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** యూరియా వినియోగాన్ని తగ్గించేందుకు ప్రోత్సాహకంగా నానో యూరియాను ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. బుధవారం ఆరవ జిల్లాల కలెక్టర్ల సదస్సులో తొలి రోజు కలెక్టర్ల సమావేశంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాలు, పది సూత్రాలు, స్వచ్ఛాంధ్ర, జీఎస్డీపీ లక్ష్యాలు, జిల్లాలలో విజయవంతమైన కార్యక్రమాలపై సమీక్షతోపాటు పీపీపీ ప్రాజెక్టులు, ఆర్టీజీఎస్, సుపరిపాలనలో సాంకేతికత, పెట్టు బడులు, వైద్యారోగ్యం, సూపర్ సిక్స్ పథకాలపై ముఖ్యమంత్రి చర్చించారు. ఈ సందర్భంగా జిల్లాలో వ్యవసాయ రంగంలో వినూత్నంగా అమలు చేస్తున్న "ఛాంపియన్ రైతుల ఎంపిక విధానం" స్మార్ట్ కిచెన్‌ల పురోగతిని గురించి జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ సిఎంకు వివరించారు. జిల్లా వ్యాప్తంగా 361 రైతు సేవా కేంద్రంల నుండి 361 రైతులను ఆయా గ్రామంలో ఎక్కువగా పండించే పంటలో నైపుణ్యం ఉండే రైతులను ఆదర్శ రైతులుగా(ఛాంపియన్)గా గుర్తించి వారి ద్వారా ఆ గ్రామం లోని మిగిలిన రైతులకు పంటల మీద, వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబందించిన కార్యక్రమాలపై అవగాహన కల్పించడం జరుగుచున్నదని, వీరు అన్ని శాఖల అధికారులకు గ్రామంలోని ఇతర రైతులకు అనుసంధాన కర్తలుగా వ్యవహరిస్తున్నారని వివరించారు. కడప జిల్లాలో దేశంలోనే మొదటిసారిగా స్మార్ట్ కిచెన్ విధానం ద్వారా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన రుచికరమైన భోజనంను అందించేందుకు కడప జిల్లాలో అమలు చేస్తున్న స్మార్ట్ కిచెన్‌కు సంబంధించి 33 స్మార్ట్ కిచెన్ లను ఒక మాసం లోపు పూర్తి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సిఎంకు వివరించారు.

# అన్నమయ్య జిల్లాలో గ్యాస్ సిలిండర్లకు కొరత లేదు

## - జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు

**మదనపల్లె,మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లాలో గ్యాస్ సిలిండర్లకు కొరత లేదని డీఆర్‌వో మధుసూదన్ రావు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరా పరిస్థితిపై జిల్లా రెవెన్యూ అధికారి సమగ్ర సమీక్ష నిర్వహించారు. గురువారం మదనపల్లె కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాల్ నందు జిల్లాలో పనిచేస్తున్న ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీలు, డిస్ట్రిబ్యూటర్లు, సివిల్ సప్లైస్ విభాగానికి చెందిన డిప్యూటీ తహసీల్దార్లతో గ్యాస్ సిలిండర్ల సరఫరా, నిల్వలు, డెలివరీ విధానం వంటి అంశాలపై జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరా విషయంలో ఎటువంటి కొరత లేదని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని గ్యాస్ ఏజెన్సీలకు అవసరమైన సిలిండర్లు చిత్తూరు, కడప, అనంతపురం డిపోల నుండి నిరంతరంగా సరఫరా అవుతున్నాయని తెలిపారు. గ్యాస్ నిల్వలు తగినంతగా ఉన్నాయని, వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సరఫరా వ్యవస్థ సక్రమంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రజలు తమ గ్యాస్ సిలిండర్లను సాధారణంగా ఐవీఆర్ఎస్ కాల్ ద్వారా లేదా గ్యాస్ కంపెనీలకు సంబంధించిన ఆన్‌లైన్ యాప్‌లు, ఇతర డిజిటల్ వేదికల ద్వారా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. బుకింగ్ చేసిన సిలిండర్లు సాధారణంగా మరుసటి రోజే వినియోగదారులకు డెలివరీ అవుతున్నాయని చెప్పారు. గ్యాస్ సరఫరా వ్యవస్థ సజావుగా కొనసాగుతున్నందున ప్రజలు అనవసరంగా ఒకేసారి ఎక్కువ సిలిండర్లు బుక్ చేసుకోవడం లేదా నిలువ చేసుకోవడం అవసరం లేదని సూచించారు. ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా పరిపాలన స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న తప్పుడు వార్తలను నమ్మకుండా, అవసరానికి అనుగుణంగా సాధారణంగా గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో కె.ఆర్.ఆర్.సి డిప్యూటీ కలెక్టర్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, సిఎస్ డిటిలు, ఆర్.ఐ బాలాజీ,ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీలు, డిస్ట్రిబ్యూటర్లు తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా రెండో వారంలోకి అడుగుపెట్టిన 'విధాత'

## - ప్రేక్షకుల మన్ననలపై నిర్మాత, దర్శకులు హర్షం

**మదనపల్లె,మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విధాత చలనచిత్రం విజయవంతంగా రెండవ వారంలో అడుగుపెట్టింది. గురువారం స్థానిక సాయి చిత్ర థియేటర్లో విధాత చిత్రం నిర్మాత డాక్టర్. అప్పినపల్లి భాస్కరాచారి, దర్శకులు మణికంత రాజేంద్ర బాబు, కథ రచయిత ఏ సురేష్, చిత్రం నటులతో కలిసి విద్యార్థులు వీక్షించడం జరిగింది. ఈ సందర్భంగా సినిమా థియేటర్ విద్యార్థుల కేరింతలతో చిత్రం లోని నటీనటుల తో వారి చూపించిన అభిమానం మధ్య సందడిగా సాగింది. గత వారం రోజులుగా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం రెండు ఆటలు ను ప్రేక్షకులు తిలకిస్తూ విధాత చలన చిత్రాన్ని పిల్లల నుంచి పెద్దల వరకు, మహిళలు నుండి యువతీ యువకులు వరకు ఈ చిత్రాన్ని, ఆదరిస్తూ అభిమానిస్తూ అండగా నిలిచి, ముందుకు తీసుకువెళ్తుండటంపై నిర్మాత డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి, దర్శకులు మణికంత రాజేంద్ర బాబులు హర్షం వ్యక్తం చేశారు. తమ తొలి ప్రయత్నంగా వెండితెరపై విడుదల చేసిన విధాత చలనచిత్రం ప్రేక్షకుల మన్ననలు అందుకోవడం చిరస్మరణీయ విజయంగా తాము గుర్తుంచుకుంటామని పేర్కొన్నారు. విద్యార్థులు విధాత సినిమాను ఉత్సాహంగా, కేరింతలతో ఎంజాయ్ చేస్తూ తిలకించడం చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా విధాత చిత్రాన్ని ప్రజలంతా, కుటుంబ సమేతంగా చూడాలని అభ్యర్థించారు. తాము చలనచిత్ర రంగాన్ని ఎంచుకొని మొట్టమొదటి ప్రయోగంగా తీసిన విధాత చిత్రం సమాజానికి మంచి సందేశం ఇవ్వడంతో పాటు, ఏబీసీ ప్రొడక్షన్స్ మదనపల్లెలో ప్రతిభ కలిగిన నటీనటులకు వేదికగా నిలిచి, వెండి తెరకు వారిని గొప్ప నటులుగా పరిచయం చేయడం జరిగిందన్నారు. నేడు విద్యార్థులు చూపిన అభిమానం, చలన చిత్ర రంగంలో మరిన్ని చిత్రాలు తీసే విధంగా ప్రేరణ, ఆసక్తిని అభిమానం, ఉత్సాహాన్ని కలిగించాయన్నారు. పలువురు ప్రేక్షకులు, విద్యార్థులు మాట్లాడుతూ తమ మదనపల్లెకు చెందిన ఏబిసి ప్రొడక్షన్స్‌లో మదనపల్లె నటీనటులు, మదనపల్లె పరిసరాల్లో తీసిన మంచి సందేశమిచ్చే విధాత సినిమాను సాయి చిత్ర థియేటర్లో చూడటం కొత్తగా ఆనందంగా ఉందన్నారు.

# ప్రజా సంక్షేమమే వైసీపీ ధ్యేయం

## - ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో నిస్సార్ అహమ్మద్

**మదనపల్లె, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నవరత్నాల ద్వారా ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ప్రజలకు చేరువగా అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు అందించిన ఘనత వైయస్సార్ సిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని మదనపల్లె వైయస్ఆర్ సీపీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పేర్కొన్నారు. వైయస్సార్సిపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవెన్యూ రోడ్డు పార్టీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిస్సార్ అహమ్మద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిశీలకులు అనూషా రెడ్డి,సీనియర్ నాయకులు శ్రీనాథ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మనుజా రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జెండా ఆవిష్కరణ అనంతరం దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. నవరత్నాలతో ప్రజా సంక్షేమానికి తన పాలనతో నాంది పలికి వైయస్సార్ సిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు చేరువయ్యారని కొనియాడారు. కరోనా కష్టకాలంలో ప్రజల కష్టాలలో పాలుపంచుకున్న వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని కితాబునిచ్చారు. జగన్మోహన్ రెడ్డి వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశాడని, అందులో మెడికల్ కళాశాలలు ఎంతో ముఖ్యమైనన్నారు. వైయస్సార్సిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కొంతమంది వైయస్సార్ సిపి అభిమానులు, వైయస్సార్ సిపి యువకులు నిస్సార్ అహమ్మద్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైకాపా మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఏ కరీముల్లా, మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్ రెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆవుల మల్లికార్జున, మయూరి రఘునాథ్ రెడ్డి, నియోజకవర్గ యువనాయకులు హర్షవర్షన్ రెడ్డి, చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు శీలం రమేష్, ఎన్.మస్తాన్ ఖాన్, రేవతి, రహమతుల్లా, షఫీ, పాల్ చంద్రశేఖర్, కొండుపల్లి ప్రసాద్ బాబు, ఈశ్వర్ నాయక్, శారదారెడ్డి, నాగమణి, లలితా రెడ్డి, అమ్మజాన్, చరణ్, కరుణాకర్ రెడ్డి, డి.శివారెడ్డి, వి.నాగరాజ రెడ్డి, మహేష్ కొత్తవారిపల్లె, యూనస్, కొత్తపల్లె మహేష్ బాబు, శ్రీనివాసులు, బయ్యన్న, మల్లికార్జున రెడ్డి, రామారావు కాలనీ పురుం సహదేవ, చెన్నకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 15న జిల్లా పరిషత్‌లో ఆధ్యాత్మిక సభ

**కడప, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఈ నెల 15న కడప జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బ్రహ్మ కుమారి సంస్థ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సమావేశం నిర్వహించడం జరుగు తుందని రాజయోగి గీతా బెహంజీ అన్నారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. శుక్రవారం సిస్టర్ జయంతి దీదీ కడపకు రానున్నారని చెప్పారు. ఇందులో బాగంగా పులివెందులలో విశ్వశాంతి భవన నిర్మాణ కార్యక్ర మంలో పాల్గొంటారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 32 సబ్ బ్రాంచ్‌లు ఉన్నాయని చెప్పారు. జిల్లా పరిషత్‌లో జరగబోవు ఆధ్యాత్మిక సభలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ప్రతిభా దీదీ, మణి అక్కయ్య, అచ్యుత్, రంగయ్య, భాషా తదితరులు పాల్గొన్నారు.

# అన్నమయ్య జిల్లా

# 'విశ్వం'లో లాజికల్ రీజనింగ్ కోడింగ్ అండ్ డీకోడింగ్‌పై వర్క్ షాప్

**మదనపల్లె/ కురబలకోట, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో లాజికల్ రీజనింగ్ కోడింగ్ అండ్ డీకోడింగ్‌పై వర్క్ షాప్ నిర్వహించారు. ఏఐ అండ్ డిఎస్ హెచ్ఓడి. డా.వి.హేమశ్రీ మాట్లాడుతూ బి.టెక్ విద్యార్థులకు డిజిటల్ కమ్యూనికేషన్ ద్వారా వచ్చే ప్లేస్ మెంట్స్ గురించి తెలుసుకోవాలని ఇంకా రీజనింగ్, కోడింగ్ అండ్ డీకోడింగ్ క్రమం తప్పకుండా ప్రాక్టీస్ చేయడం వల్ల లైఫ్ స్కిల్స్ వస్తాయని తెలిపారు. సిఎస్ఈ ప్రొఫెసర్ వసంత్ కుమార్ సెల్వం మాట్లాడుతూ ఉద్యోగం ఎంత చిన్నది ఐనా గవర్నమెంట్ ఉద్యోగం అని చెప్పుకోవచ్చు అని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బేసిక్ సైన్సస్ అండ్ హ్యూమానిటీస్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఎడ్యుకేషనల్ మ్యాగజైన్స్ రైటర్ డా.ఎం.రెడ్డి రాము మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాఫ్ట్వేర్ ఉద్యోగాలు మాత్రమే కాకుండా ప్రభుత్వ రంగాలలో కూడా చాలా ఉద్యోగాలు ఉన్నాయని తెలిపారు. వాటిని నోటిఫికెషన్స్ ద్వారా ఎంచుకొని వాటికీ అనుగుణంగా ప్రణాళికా బద్ధంగా చదవాలని లాజికల్ రీజనింగ్, సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేటివ్ స్కిల్స్‌ను బాగా పెంచుకోవాలని తెలుపుతూ బి.టెక్ విద్యార్థులు బ్యాంకింగ్, రైల్వే, ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, గ్రూప్స్, సివిల్ సర్వీస్ లాంటి అత్యున్నత స్థాయిలలో ప్రభుత్వ ఉద్యోగాలను సాధించవచ్చని అన్నారు. కార్పొరేట్ జాబ్ సెలక్షన్‌లో మాక్ ఇంటర్వ్యూస్ ప్రిపరేషన్ అందులో గల అంశాలను ప్రతి రోజూ ప్రాక్టీస్ చెయాలని సూచించారు. ఇంకా రీజనింగ్ ఆప్టిట్యూడ్ ద్వారా వర్బల్ నాన్ వర్బల్, కోడింగ్ అండ్ డీ కోడింగ్, అనాలజీ, క్యాలెండర్, డేటా ఎనాలిసిస్, పజిల్స్, బ్లడ్ రిలేషన్, నెంబర్ సిరీస్ లలో గల షార్ట్ కట్ టిప్స్ ను విద్యార్థులు బాగా నేర్చుకోవాలని, అన్ని ప్రభుత్వ ప్రైవేట్ ఉద్యోగ పరీక్షలు, ఇంటర్వ్యూస్‌కి ఈ వర్క్ షాప్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా.డి.రమణా రెడ్డి విద్యార్థులలో ఆలోచనా శక్తి, ప్రాబ్లెమ్ సాల్వింగ్ నైపుణ్యం పెంచుకోవాలని, విద్యార్థులు ఉన్నత స్థాయిని చేరుకోవాలంటే బాగా కష్టపడి చదవాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.డి.రమణా రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.టి. ఎస్.గౌస్ భాష, డీన్స్, ఏఐ అండ్ డిఎస్ విభాగ అధిపతి డా.వి.హేమశ్రీ, డా.వసంత్ సెల్వ కుమార్, విశ్వనాధరెడ్డి, అధ్యాపకులు, బి.టెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

# ముస్లింల శ్మశాన వాటిక పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

**మదనపల్లె,మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పవిత్ర రంజాన్ మాసంలో 25వ రోజు ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే సతామి పండుగ మార్చి 15వ తేదీ నిర్వహిస్తున్న సందర్భంలో నేడు ముస్లింల బరియల్ గ్రౌండ్ ను మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించడం కోసం ఎమ్మెల్యే షాజహాన్ భాష స్మశానంలో పర్యటించారు. జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ ప్రమీలతో కలిసి పరిశీలించి 15వ తేదీ సాయంత్రానికి పారిశుద్ధ్య పనులను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పురుషోత్తం, గురునాథ యాదవ్, ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, రెడ్డి రాయల్, నయాజ్, నాయీ బ్రాహ్మణ సంఘం మంజునాథ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కీర్తి శేషులు పిసి జయ చంద్ర రెడ్డి వర్ధంతి సందర్భంగా వెలుగు సంస్థలో అన్నదాన కార్యక్రమం

**మదనపల్లె,మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వెలుగు సంస్థలో పిఎస్ఆర్ గ్రూప్స్ స్వర్గీయ కీర్తి శేషులు పిసి.జయ చంద్ర రెడ్డి 14వ వర్ధంతిని వారి కుటుంబ సభ్యులు గురువారం నిర్వహించారు. వారి సతీమణి సుమిత్రమ్మ, కుమారుడు శివ శంకర్ రెడ్డి, కోడలు లక్ష్మి ప్రసన్న, మనవడు సి.లిఖిత్, వారి కుటుంబ సభ్యులు వెలుగులోని దివ్యాంగులకు, వృద్ధ మహిళలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వెలుగు సెక్రటరీ యం ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పది మంది మంచికోరే పిఎస్ఆర్ గ్రూప్స్ కుటుంబం పది కాలాల పటు సంతోషంగా ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, వార్డెన్ స్వీటీ సోషల్ వర్కర్ యం.గీత, వెలుగు చిన్నారులు, వృద్ధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా రాటకొండ శశిధర్, ప్రణతిల వివాహ వేడుక

**మదనపల్లె, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆర్.జె వెంకటేష్ కుమారుడు రాటకొండ శశిధర్, ఖమ్మం పట్టణానికి చెందిన ప్రణతిల వివాహ వేడుక గురువారం ఖమ్మంలో వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, మదనపల్లి నియోజకవర్గానికి చెందిన టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ముందుగా అతిథులకు ఆర్.జె.వెంకటేష్ దంపతులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కె.నారాయణ మాట్లాడుతూ మదనపల్లి పట్టణంతో తనకున్న అనుబంధాన్ని, ఆర్.జెవెంకటేష్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. రాజకీయాలలో అజాతశత్రువుగా పేరు ప్రఖ్యాతులు గడించి రాజకీయాలలో పార్టీలకు అతీతంగా అందరితో కలసిమెలిసి ఉండే మనస్తత్వం కలిగిన వ్యక్తి ఆర్.జె.వెంకటేష్ అని కొనియాడారు. ఆయన తనయుడి వివాహ వేడుకకు హాజరుకావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆర్.జె వెంకటేష్ మాట్లాడుతూ తమ ఆహ్వానం మేరకు తన కుమారుడు వివాహ వేడుకకు హాజరైన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, శ్రేయోభిలాషులు, మిత్రులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. అదేవిధంగా 15న ఆదివారం ఆర్ కన్వెన్షన్ హాల్ నందు విందు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమానికి టిడిపి నాయకులు కార్యకర్తలు, కూటమి నాయకులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ వివాహ వేడుకకు మదనపల్లి నుండి రాటకొండ మధుబాబు, ఒంటికొండ వెంకటేష్, పూల మురళి, గండికోట గణేష్ బాబు, లంకిపల్లి శ్యామ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# హోటళ్లలో గృహ వినియోగ సిలిండర్లు వాడితే చర్యలు

**పుట్టపర్తి, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో తహసీల్దారు కళ్యాణ్ చక్రవర్తి ,సి.ఎస్.డి.టి రామకృష్ణ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు హోటళ్లలోని వంట గదులను పరిశీలించి, సిలిండర్ల వినియోగాన్ని తనిఖీ చేశారు. వాణిజ్య అవసరాల కోసం కేటాయించిన కమర్షియల్ సిలిండర్లకు బదులుగా, తక్కువ ధరకే లభించే గృహ వినియోగ సిలిండర్లను వాడటం చట్టవిరుద్ధం. నిబంధనలు అతిక్రమించి గృహ వినియోగ సిలిండర్లను వ్యాపారాలకు ఉపయోగిస్తే అట్టి వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. రాబోయే రోజుల్లో తనిఖీలను మరింత ముమ్మరం చేస్తామని, సిలిండర్లను అక్రమంగా మళ్లించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. వ్యాపార యజమానులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఈ సందర్భంగా అధికారులు కోరారు.

# న్యాయవ్యవస్థలో అవినీతి రచయితలు

## -వారిని దూరంపెట్టాలన్న సుప్రీం ధర్మాసనం

**న్యూఢిల్లీ,మార్చి12(ఆర్ఎన్ఎ):** జాతీయ విద్యా పరిశోధనా శిక్షణ మండలి ఎన్సీఈఆర్టీ 8వ తరగతి సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకంలో 'న్యాయ వ్యవస్థలో అవినీతి' పాఠ్యాంశాన్ని చేర్చేందుకు కారకులైన వారిపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ ముగ్గురు నిపుణులతో ఇకపై ఎలాంటి సంబంధాలు కొనసాగించొద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. న్యాయ వ్యవస్థలో నెలకొన్న అవినీతి గురించి వివాదాస్పద అంశంగా పాఠ్యపుస్తకంలో చేర్చడంపై ఎన్సీఈ ఆర్టీ.. సర్వోన్నత న్యాయస్థానానికి బేషరతుగా క్షమాపణలు చెప్పడంతో పాటు ఆ పుస్తకాన్ని ఉపసంహరించుకున్న సంగతి తెలిసిందే. ఈ అంశంపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ వివాదాస్పద పాఠ్యాంశాన్ని ప్రొ.మైఖేల్ డానినో సహా టెక్స్ట్‌బుక్ డెవలప్‌మెంట్ టీమ్ సభ్యులు సుపర్ణ దివాకర్, అలోక్ ప్రసన్న కుమార్‌లు రూపొందించారని ప్రభుత్వం తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై స్పందించిన న్యాయ స్థానం.. 'ప్రొ.మైఖేల్ డానినో, ఆయన సహచరులు సుపర్ణ దివాకర్, అలోక్ ప్రసన్న కుమార్‌లకు భారత న్యాయ వ్యవస్థను గురించిన సరైన పరిజ్ఞానం లేకుండా ఉండాలి, లేదా విద్యార్థుల ముందు న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దిగజార్చేందుకు వాళ్లు ఉద్దేశపూర్వకంగానే వాస్తవాలను వక్రీకరించి తప్పుగానైనా చూపించి ఉండాలి' అని పేర్కొంది. ఇకపై రాబోయే తరం విద్యార్థులకు అవసరమైన పాఠ్య

పుస్తకాల రూపకల్పన ప్రక్రియలో ఆ ముగ్గురి ప్రమేయం ఉండకూడదని, వారిని తక్షణమే పక్కన పెట్టాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వ నిధులతో పూర్తిగా లేదా పాక్షికంగా సంబంధమున్న ఎలాంటి బాధ్యతలనూ అప్పగించకూడదని తేల్చి చెప్పింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయవ్యవస్థ గురించి విద్యార్థులకు బోధించడం మంచి విషయమే అయినప్పటికీ.. సంబంధిత పాఠ్య ప్రణాళిక తయారీలో కనీసం ఒక్క న్యాయ నిపుణుడికీ అవకాశం కల్పించకపోవడం తమకు అసంతృప్తి కలిగిస్తోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎన్ఈసీఆర్టీ లీగల్ స్టడీస్‌కు సంబంధించి పాఠ్యప్రణాళిక రూపకల్పనలో న్యాయ రంగానికి చెందిన నిపుణులతో వారం రోజుల్లోగా ఓ కమిటీని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ కమిటీలో మాజీ సీనియర్ న్యాయమూర్తి, ఓ ప్రసిద్ధ న్యాయవాది సహా ప్రముఖ విద్యావేత్త ఒకరుంటే బాగుంటుందని అభిప్రాయపడింది. వీరు నేషనల్ జ్యుడీషియల్ అకాడమితో సంబంధం ఉన్నవారైతే మరింత మంచి విషయాన్ని పొందుపరిచేందుకు అవకాశముం టుందని తెలిపింది. వివాదాస్పద ఎన్సీఈఆర్టీ పాఠ్య పుస్తకాన్ని పూర్తిగా నిషేధిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఫిబ్రవరి 26న తీర్పు వెలువరించగా.. దానిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం జరిగినట్లు ధర్మాసనం గుర్తుచేసింది. ఈ ప్రచారం వెనుక ఉన్న సామాజిక మాధ్యమ వేదికలు, వ్యక్తుల వివరాలను తమకు అందజేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. కోర్టు తీర్పులను వక్రీకరిస్తూ ఇష్టానురీతిన వ్యాఖ్యలు చేసేవారి విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేసింది.

# బిఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు క్లోజ్

## -స్పీకర్ నిర్ణయంతో ఏకీభవించిన సుప్రీం -తదుపరి విచారణ అవసరం లేదని వ్యాఖ్య

**న్యూఢిల్లీ,మార్చి12(ఆర్ఎన్ఎ):** తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు విచారణ ఎట్టకేలకు ముగిసింది. రాష్ట్ర రాజకీయాల్లో కొన్నిరోజులుగా తీవ్ర కలకలం రేపిన ఈ కేసు విచారణను గురువారం నాడు సుప్రీంకోర్టు ముగించింది. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని చెప్పినా.. స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేటీఆర్, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ గురువారం విచారణకు రాగా విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై సుదీర్ఘ విచారణ అనంతరం ఉన్నత న్యాయస్థానం తుది తీర్పు వెలువరించింది. ఈ కేసును జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించగా.. స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ ఇప్పటికే విచారణ జరిపి, తగిన నిర్ణయం తీసుకున్నారని ఆయన కోర్టుకు వివరించారు. దీంతో ఈ సమస్య సభాపతి కార్యాలయంలోనే ముగిసిందన్నారు. సింఘ్వీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. ఈ వ్యవహారంపై స్పీకర్ ఇప్పటికే తుది నిర్ణయం తీసుకున్నందున విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని భావించింది. దీంతో కోర్టు విచారణ ముగిసినట్లేనని వెల్లడించింది. స్పీకర్ ఆదేశాలను రెండు రోజుల్లో అధికారికంగా ప్రచురించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఆ తరువాత పిటిషనర్లకు కావాల్సిన డాక్యుమెంట్లను కూడా నాలుగు రోజుల్లో అందజేయాలని సూచించింది. దీంతో 10 మంది ఎమ్మెల్యేలకు సభాపతి క్లీన్ చిట్ ఇచ్చినట్లైంది. ఈ వ్యవహారంలో పది మంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఊరట దక్కింది. అయితే పోరాడిన బిఆర్ఎస్‌కు మాత్రం న్యాయం దక్కలేదని ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానించారు. స్పీకర్ తీర్పుపై ఇప్పటికే బిఆర్ఎస్ తన నిరసన తెలియచేసింది. స్పీకర్ తీర్పును సవాల్ చేస్తామన్న బిజెపికి కూడా ఈ తీర్పుతో ఇక అవకాశం లేనట్లుగానే భావించాలి.

# కాశ్మీర్ మాజీ సిఎం ఫరూక్ అబ్దుల్లాపై హత్యాయత్నం

## -తృటిలో తప్పించుకున్న మాజీ ముఖ్యమంత్రి -తనది 20 ఏళ్ల పగ అన్న దుండగుడు

**జమ్ము,మార్చి12(ఆర్ఎన్ఎ):** జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లాపై హత్యాయత్నం జరిగింది. ఓ వివాహ వేడుకలో నిందితుడు ఆయనపై కాల్పులకు పాల్పడేందుకు ప్రయత్నించాడు. వెంటనే భద్రతా సిబ్బంది అప్రమత్తమవడంతో.. ఫరూక్ సురక్షితంగా బయటపడ్డారు. 20 ఏళ్లుగా తాను ఫరూక్‌ను చంపాలనుకుంటున్నానని నిందితుడు పోలీసులతో పేర్కొన్నాడు. బుధవారం జమ్మూ శివార్లలోని హోటల్‌లో జరిగిన ఓ వివాహ వేడుకకు ఫరూక్ అబ్దుల్లా హాజరయ్యారు. ఆయనతో పాటు జమ్మూకశ్మీర్ డిప్యూటీ సీఎం సురీందర్ ఛౌదరీ కూడా ఉన్నారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి వెనక నుంచి ఫరూక్‌పై పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో తుపాకీతో కాల్చేందుకు ప్రయత్నించాడు. అక్కడ ఉన్నవారు వెంటనే అతడిని పట్టుకొని చితకబాదారు. దీనికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు కూడా తాజాగా వెలుగులోకి వచ్చాయి. నిందితుడు జమ్మూకి చెందిన 63 ఏళ్ల కమల్‌సింగ్ జమ్వాల్‌గా పోలీసులు గుర్తించారు. జమ్మూలో దుకాణాలు నడుపుతోన్న కమల్ విచారణ సమయంలో కీలక విషయాలు వెల్లడించాడు. గత 20 ఏళ్లుగా తాను ఫరూక్ అబ్దుల్లాను చంపాలనుకుంటున్నానని పేర్కొన్నాడు. ఇది తన వ్యక్తిగత అజెండాగా వెల్లడించాడు. కాల్పులకు ఉపయోగించిన తుపాకీకి లైసెన్స్ ఉన్నట్లు తెలిపాడు. ఘటన సమయంలో నిందితుడు మద్యం మత్తులో ఉన్నాడని పోలీసులు పేర్కొన్నారు. తుపాకీని స్వాధీనం చేసుకున్నామని, ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తన తండ్రిపై జరిగిన హత్యాయత్నంపై జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా స్పందించారు. లోడ్ చేసిన తుపాకీతో తన తండ్రిని ఓ వ్యక్తి కాల్చేందుకు ప్రయత్నించాడని పేర్కొన్నారు. అయితే, భద్రతా సిబ్బంది అప్రమత్తతతో అది విఫలమైందన్నారు. ఫరూక్‌కు జెడ్ ప్లస్ భద్రత ఉన్న విషయాన్ని ఒమర్ ప్రస్తావించారు. ఇంత భద్రత ఉన్నా.. నిందితుడు అంత దగ్గరగా ఎలా రాగలిగాడని ప్రశ్నించారు. ఇక, భద్రతా వైఫల్యం కారణంగానే ఈ ఘటన చోటుచేసుకుందని ఉప ముఖ్యమంత్రి ఛౌదరి పేర్కొన్నారు.

# భార్య వేధింపులు తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్య

**హైదరాబాద్,మార్చి12(ఆర్ఎన్ఎ):** భార్య వేధింపులు తాళలేక భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం సృష్టించింది. నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనగర్‌కు చెందిన నగెల్లి శ్రీనివాస్ (41) ఓ ప్రైవేట్ ఉద్యోగి. అతని స్వగ్రామం మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణాపూర్. శ్రీనివాస్ 2012లో జ్యోతిని పెళ్లి చేసుకున్నాడు. ఈ దంపతులకు ఓ కుమారుడు ఉన్నాడు. భార్య గ్రూప్స్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు భర్త శ్రీనివాస్ చాలా హెల్ప్ చేశాడు. భర్త సహాయంతో జ్యోతి గ్రూప్స్‌లో విజయం సాధించి ఎక్సైజ్ సీఐగా నియమితులయ్యింది. ఉద్యోగం వచ్చిన తర్వాత భర్తను దూరం పెట్టడం స్టార్ట్ చేసింది. అంతే కాదు.. భర్తపై వరకట్నం వేధింపులు, విడాకుల కేసులు పెట్టింది. వేధింపులకు పాల్పడటంతో శ్రీనివాస్ తట్టుకోలేక పోయాడు. తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. 'భార్య వేధింపులు, కేసుల కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నాను' అని సూసైడ్ నోట్ రాశాడు. శ్రీనివాస్ సోదరుడు శివకృష్ణ ఇంటికి వచ్చి చూడగా అతను మృతిచెందినట్లు గుర్తించాడు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు.

# ఇంధన భద్రతపై ఇరాన్‌తో చర్చిస్తున్నాం!

## -ఇప్పటికే ఇరాన్‌తో మంత్రి జైశంకర్ చర్చలు

## -విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్

**న్యూఢిల్లీ,మార్చి12(ఆర్ఎన్ఎ):** ఇంధన భద్రతపై ఇరాన్‌తో చర్చిస్తున్నాం విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. దేశ ఇంధన భద్రతపై ఇరాన్‌తో విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ మాట్లాడారని రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. హర్మూజ్ మీదుగా భారత్‌కు వచ్చే నౌకల ప్రయాణం గురించి కూడా చర్చించినట్లు తెలిపారు. మరోవైపు, డీజిల్ సరఫరా కోసం బంగ్లాదేశ్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసిందని, దానిని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. శ్రీలంక, మాల్దీవుల నుంచీ ఇదే తరహా అభ్యర్థనలు వచ్చాయని, అయితే.. ముందుగా మన దేశ అవసరాలను కేంద్రం పరిగణనలోకి తీసుకుంటుందన్నారు. ప్రస్తుతం ఇరాన్‌లో దాదాపు తొమ్మిది వేల మంది భారతీయులు ఉన్నారని.. వీరిలో విద్యార్థులు, నౌకా సిబ్బంది, వ్యాపారవేత్తలు, యాత్రికులు ఉన్నట్లు విదేశాంగశాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు. ఘర్షణ మొదలైన వెంటనే విద్యార్థులు సహా అనేక మంది భారతీయులను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. స్వదేశానికి తిరిగి రావాలనుకునే భారతీయులందరికీ సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. మన రాయబార కార్యాలయం అన్ని సమయాల్లో అందుబాటులో ఉందన్నారు. అఫ్గాన్‌తో ఇటీవల ఘర్షణకు భారత్ కారణమంటూ పాకిస్థాన్ చేసిన ఆరోపణలను భారత విదేశాంగశాఖ ఖండించింది. అవి నిరాధార ఆరోపణలని స్పష్టం చేసింది. తన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు భారత్‌పై నిందలు వేయడం పాకిస్థాన్‌కు పరిపాటేనని విమర్శించింది. దశాబ్దాలుగా సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాది దేశం మాటలకు విశ్వసనీయత లేదని తెలిపింది.

# ఇంధన కొరత, ధరలపై కేంద్రం అప్రమత్తం

## -ఫ్యూయల్ సప్లై మేనేజ్‌మెంట్ చైన్ ప్రోగ్రామ్ అమలు

**న్యూఢిల్లీ,మార్చి12(ఆర్ఎన్ఎ):** మధ్యప్రాచ్యంలో యుద్ధం ఎఫెక్ట్ ప్రపంచమంతా కనిపిస్తోంది. భారత్‌పై మిడిల్ ఈస్ట్ యుద్ధ ప్రభావం పడింది. ఇప్పటికే భారత్‌లోని ప్రధాన నగరాల్లో ఎల్‌పీజీ సంక్షోభం పెరిగిపోయింది. ఇక పెట్రోల్, డీజిల్ ధరలపై సామాన్యులు భయపడుతున్నారు. ఈ ధరలు రానున్న కొన్ని రోజుల్లో విపరీతంగా పెరుగుతాయనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తాజాగా స్పందించింది. పెట్రోల్, డీజిల్ ధరలపై క్లారిటీ ఇచ్చింది. ఈ ధరపై ప్రస్తుతం ప్రభావం ఉండబోదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. దేశీయంగా చమురు ధరలను స్థిరంగా ఉంచేందుకు ఇప్పటికే ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకున్నట్లు చెబుతున్నారు. ఇధనం ఇంధన సరఫరాలోనూ ఎలాంటి ఆటంకాలు కలగకుండా 'ఫ్యూయల్ సప్లై మేనేజ్‌మెంట్ చైన్' ప్రోగ్రామ్‌ను ప్రభుత్వం ఇప్పటికే యాక్టివేట్ చేసినట్లు ఓ జాతీయ మీడియా సంస్థ కథనం వెల్లడించింది. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన 'స్ట్రెట్ ఆఫ్ హార్ముజ్' మార్గంలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్న నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. వాస్తవానికి గతంలో 'స్ట్రెట్ ఆఫ్ హార్ముజ్' మార్గం గుండా భారత్ 40శాతం చమురును దిగుమతి చేసుకునేది. ఈ మిడిల్ ఈస్ట్ దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు భారత్ వ్యూహాన్ని రూపొందించింది. హార్ముజ్ మార్గం కాకుండా ఇతర ప్రాంతాల నుంచి చమురు దిగుమతులను 60 శాతం నుంచి 70 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం దాదాపు 40 దేశాల నుంచి భారత్ చమురును సేకరిస్తోంది.

# యుద్ధ సంక్షోభంలో భారత్ తొలి విజయం

## -హర్మూజ్ జలసంధి నుంచి భారత్‌కు చమురు నౌక -క్షేమంగా ముంబై తీరం చేరుకున్న షెన్‌లాంగ్ -ఇరాన్ పరోక్ష మద్దతుతో తొలి నౌక రాక

**ముంబై,మార్చి12(ఆర్ఎన్ఎ):** పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ ఒక చమురు నౌక హర్మూజ్‌ను దాటి భారత్‌కు చేరుకుంది. ఎటువైపు నుంచి క్షిపణి దూసుకొస్తుందో తెలియని ఘర్షణ వాతావరణంలో జలసంధిని సురక్షితంగా దాటి, ముంబయి పోర్ట్‌కు చేరుకున్న తొలినౌక ఇదే కావడం విశేషం. అయితే హర్మూజ్ నుంచి రావడానికి ఇరాన్ పరోక్షంగా సహకరించిందని సమాచారం. హర్మూజ్ అంతరాయాలతో భారత్‌లో ఇంధన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ సమయంలో షెన్‌లాంగ్ విజయవంతంగా దేశానికి చేరడం, మరోవైపు భారత పతాక నౌకలు హర్మూజ్‌నుంచి వెళ్లొచ్చని ఇరాన్ అనుమతిచ్చినట్లు వార్తలు రావడం ఊరటనిస్తోంది. దీనిని నడిపిన కెప్టెన్ కూడా ఇండియనే. లైబీరియా జెండాతో ఉన్న షెన్‌లాంగ్ సూయెజ్‌మాక్స్ చమురు ట్యాంకర్ బుధవారం ముంబయి నౌకాశ్రయానికి చేరుకుంది.



మూడు రోజుల క్రితమే అది హర్మూజ్ ను దాటింది. తన ప్రయాణాన్ని ఎవరూ ట్రాక్ చేయకుండా చురుగ్గా వ్యవహరించింది. మార్చి ఒకటిన ఈ ట్యాంకర్ సౌదీ అరేబియా పోర్ట్ వద్ద చమురు లోడ్ చేసుకుంది. మారిటైమ్ ట్రాకింగ్ డేటా ప్రకారం.. దాని సిగ్నల్స్ మార్చి 8న హర్మూజ్‌లో కనిపించాయి. ఆ తర్వాత అది జాడలేకుండా పోయింది. నౌకలోని సిబ్బంది ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్, ట్రాన్స్‌పాండర్లను స్విచ్ఛాఫ్ చేశారని తెలుస్తోంది. ప్రస్తుతం అడుగడుగునా ప్రమాదకరంగా మారిన హర్మూజ్‌లో గుర్తింపు తెలియకుండా సిబ్బంది ఈ నిర్ణయం తీసుకున్నారు. జలసంధిని దాటి ఇండియా దిశగా ప్రయాణిస్తున్నప్పుడు.. అంటే ఒకరోజు తర్వాత మళ్లీ ట్రాకింగ్ సిస్టమ్స్‌లో ఈ షిప్ కనిపించింది. సంక్షోభ సమయాల్లో ప్రత్యర్థులకు చిక్కకుండా ఉండేందుకు అసాధారణ పరిస్థితుల్లో షిప్పింగ్ కంపెనీలు ఈ టెక్నిక్‌ను వాడుతుంటాయి. దీనిని గోయింగ్ డార్క్ గా చెప్తుంటారు. అంతర్జాతీయ సముద్రయాన నిబంధనల ప్రకారం.. భద్రత, రియల్ టైమ్ ట్రాకింగ్ కోసం ఏఐఎస్‌ను ఎప్పుడూ యాక్టివ్‌గానే ఉంచాలి. ఇక, ఇప్పుడు ముంబయికు షెన్‌లాంగ్.. 1,35,335 మెట్రిక్ టన్నుల చమురును మోసుకొచ్చింది. గ్రీస్‌లోని డైనకామ్ ట్యాంకర్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ఈ నౌక కార్యకలాపాలు చూస్తోంది.

# మన విదేశాంగ విధానం అమెరికాకు తకాట్టు

## -ఎవరి నుంచి చమురు కొనాలో అమెరికా పెత్తనం ఏంటి -ఎన్‌స్టీన్ ఫైల్స్‌లో దొరికి పోవడంతోనే అమెరికాకు దాసోహం

## -లోక్‌సభలో రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు

**న్యూఢిల్లీ,మార్చి12(ఆర్ఎన్ఎ):** భారత విదేశాంగ విధానన్ని మోడీ అమెరికాకు తకట్టు పెట్టారని విపక్షనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. రష్యా నుంచి చమురు దిగుమతులకు అమెరికా అడ్డంకులేంటని ప్రశ్నించారు. మనం చమురు ఎక్కడ కొనాలో అమెరికా నిర్ణయిస్తుందంటే మన విదేశాంగ విధానం తాకట్టు పెట్టినట్లేనని అన్నారు. హర్మూజ్ జలసంధి నుంచి పెద్ద ఎత్తున దిగుమతులు జరగాల్సి ఉంది. యుద్ధం కారణంగా దిగుమతులు ఆగిపోయాయి. ఇది ఆరంభం మాత్రమే. గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది. మనం ఎవరి నుంచి చమురు కొనాలో అమెరికా నిర్ణయిస్తోంది. రష్యా నుంచి చమురు కొనాలో..? వద్దో..? మనకు మనం నిర్ణయించుకోవాలి. రష్యా నుంచి చమురు కొనుగోలుపై అమెరికా జోక్యం ఎందుకు..? భారత్ వంటి పెద్ద దేశానికి మరోదేశం అనుమతి ఎందుకు..? ఇలా ఎందుకు జరుగుతోందా అని ఆలోచిం చాను. నా ప్రశ్నకు సమాధానం ఎప్‌స్టీన్ ఫైల్స్ రూపంలో దొరికింది. ఎప్‌స్టీన్ ఫైళ్ల ప్రభావం ఎల్‌పీజీ దిగుమతులపై పడినట్లు ఉంది. ఎప్‌స్టీన్‌తో సంబంధాలను పెట్రోలియం మంత్రే అంగీకరించారని రాహుల్ వ్యాఖ్యలు చేశారు. ఇవి దుమారం రేపాయి. దీంతో స్పీకర్ ఓం బిర్లా స్పందించారు. నోటీసు ఇచ్చిన అంశంపైనే మాట్లాడాలని సూచించారు. సభ్యుల ఇష్టాఇష్టాల మేరకు సభ నడవదని స్పష్టం చేశారు. ఇదే అంశంపై పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ ప్రసంగాన్ని విపక్షాలు అడ్డుకున్నాయి. ఎప్‌స్టీన్ అంటూ లోక్‌సభలో విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. ఆ గందరగోళం మధ్యే మంత్రి మాట్లాడారు. ఇరాన్, అమెరికా – ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో గ్యాస్ కొరతతో భారత దేశం అల్లాడుతోందని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ప్రస్తుత పరిస్థితికి మోదీ ప్రభుత్వమే కారణమని ఆయన విమర్శించారు. పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతుందన్నారు. అమెరికా–ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధంలో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలకు 20 శాతం చమురు హార్మూజ్ జల సంధి నుంచి వస్తుందని వివరించారు. ప్రస్తుతం ఆ జల సంధిని మూసివేశారని పేర్కొన్నారు. గ్యాస్ కొరత కారణంగా దేశవ్యాప్తంగా రెస్టారెంట్లు మూతపడ్డాయని చెప్పారు. ఎల్పీజీ గ్యాస్ కొరత నేపథ్యంలో ప్రజలు భయాందోళనలో ఉన్నారన్నారు. దేశానికి పునాది ఇంధన భద్రత అని అభివర్ణించారు. భారత్ వ్యవహారాలను అమెరికా శాసిస్తోందని మండిపడ్డారు. యూఎస్ అనుమతి లేకుంటే ముడి చమురు కొనుగోలు చేయ్యారా? అంటూ వ్యంగ్యంగా కేంద్రా న్ని నిలదీశారు. భారత్ వంటి పెద్ద దేశానికి మరో దేశం అనుమతి అవసరమా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. పెట్రోలియం మంత్రికి ఎప్‌స్టీన్‌తో సంబంధాలున్నాయని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు చేసిన వెంటనే రాహుల్ మైక్‌ను స్పీకర్ ఓం బిర్లా కట్ చేశారు. అంతలో సభలోని హర్దీప్ సింగ్ స్పందిస్తూ.. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. హర్దీప్‌సింగ్ ప్రసంగాన్ని విపక్షాలు అడ్డుకున్నాయి. ఎప్‌స్టీన్ అంటూ సభలో విపక్ష పార్టీల సభ్యులు బిగ్గరగా నినాదాలు చేశారు.

# గ్యాస్ కొరతపై విపక్షాల ఆందోళన

## -పార్లమెంటు నుంచి బయటకు చేరిన నిరసనలు

## -ముకరద్వారం ముందు విపక్ష ఎంపిల నిరసన ప్రదర్శన

**న్యూఢిల్లీ,మార్చి12(ఆర్ఎన్ఎ):** 'మోదీజీ –ఎల్‌పిజి' అంటూ ప్రతిపక్షాలు గురువారం పార్లమెంటు ఎదుట ఆందోళన చేపట్టారు. కమర్షియల్ ఎల్‌పిజి సిలిండర్ల కొరతపై మోదీ ప్రభుత్వం సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి, ఎసి సహా పలువురు ఎంపిలు మకరద్వారం ఎదుట ఆందోళన చేపట్టారు. 'నామ్ నరేందర్, కామ్ సరెండర్', 'మోదీజి, ఎల్‌పిజి' అంటూ నినాదాలు చేశారు. ప్రియాంక వాద్రా గాంధీ సహా పలువురు మహిళా ఎంపిలు ఇటుకల పొయ్యిలను ప్రదర్శించారు. ప్రధాని మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. పశ్చిమాసియా పరిస్థితులు, భారత్‌పై దాని ప్రభావంపై పూర్తి స్థాయిలో చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రధాని మోదీపై విరుచుకుపడ్డారు. ఎల్‌పిజి కొరతపై ప్రజలు ఆందోళన చెందవద్దని ప్రధాని పేర్కొన్నారని, కానీ 'పూర్తి భిన్నమైన కారణాల'తో ఆయన తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఎద్దేవా చేశారు. ఎప్‌స్టిపిన్ ఫైల్స్, అదానీ కేసులపై ప్రధాని ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. పార్లమెంటుకు వచ్చేందుకు కూడా మోదీ భయపడుతున్నారని, బుధవారం పార్లమెంటులో ఆయన కుర్చీ ఖాళీగా ఉండటం అందరం చూశామని అన్నారు. ప్రజలకు ఆందోళన చెందవద్దని చెబుతున్నారని, కానీ ఆయన ఆందోళనకు గురువుతన్నారన్నది స్పష్టమౌతోందని అన్నారు. గ్యాస్‌పై అబద్ధాలాడుతున్న మోదీ సర్కారు గ్యాస్ కొరత విషయంలో కేంద్రం తీరుపై కాంగ్రెస్ మండిపడింది. వాస్తవాన్ని ప్రజలకు చెప్పకుండా మోదీ సర్కారు అబద్ధమాడుతోందని కాంగ్రెస్ నాయకులు దుయ్యబట్టారు. ఎల్‌పీజీ కొరతపై సభలో చర్చకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సభ్యులు పార్లమెంటు ముందు ప్రదర్శన నిర్వహించారు.




# తొలి పోరులో బెంగళూరుతో హైదరాబాద్ ఢీ!

## -ఐపీఎల్ 2026 సమరానికి షెడ్యూల్ ఖరారు -డిఫెండింగ్ ఛాంపియన్‌తోనే ఆరంభం

## -బెంగళూరు వేదికపై కొనసాగుతున్న సస్పెన్స్

**న్యూఢిల్లీ,మార్చి12(ఆర్ఎన్ఎ):** క్రికెట్ ప్రేమికులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్‌కు నగారా మోగింది. టాటా ఐపీఎల్ 2026 తొలి దశ షెడ్యూల్‌ను బీసీసీఐ బుధవారం విడుదల చేసింది. మార్చి 28 నుండి ఏప్రిల్ 12 వరకు జరగనున్న మొదటి దశలో మొత్తం 20 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. మూడు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున ఎన్నికల తేదీలు ప్రకటించిన తర్వాతే ఐపీఎల్ పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేస్తామని బోర్డు ప్రకటించింది. మార్చి 28న బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియం వేదికగా జరగనున్న ఆరంభ వేడుకల అనంతరం తొలి పోరు ప్రారంభం కానుంది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, మాజీ ఛాంపియన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తొలి మ్యాచ్‌లో తలపడనున్నాయి. సొంత గడ్డపై ఆర్సీబీ బోణీ కొట్టాలని చూస్తుండగా, హైదరాబాద్ తమ సత్తా చాటేందుకు సిద్ధమైంది. మరుసటి రోజు ఆదివారం ముంబైలోని వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లు ఢీకొంటాయి. తొలి దశలో మొత్తం నాలుగు డబుల్ హెడర్ అంటే రోజుకు రెండు మ్యాచ్‌లు మ్యాచ్‌లు ఉన్నాయి. మధ్యాహ్నం మ్యాచ్‌లు 3:30 గంటలకు, రాత్రి మ్యాచ్‌లు 7:30 గంటలకు ప్రారంభమవుతాయి. ఏప్రిల్ 4న సీజన్‌లో తొలి డబుల్ హెడర్ జరగనుంది. ఆ రోజు మధ్యాహ్నం ఢిల్లీ వర్సెస్ ముంబై, రాత్రి గుజరాత్ టైటాన్స్ వర్సెస్ రాజ స్థాన్ రాయల్స్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ సీజన్‌లో మ్యాచ్‌లు బెంగళూరు, ముంబై, గౌహతి, న్యూ చండీగఢ్, లక్నో, కోల్‌కతా, చెన్నై, ఢిల్లీ, అహ్మదాబా, హైదరాబాద్‌లలో జరగనున్నాయి. రాజస్థాన్ రాయల్స్ తమ తొలి హోమ్ మ్యాచ్‌లను గౌహతిలో ఆడనుంది. అక్కడ చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది. పంజాబ్ కింగ్స్ తమ హోమ్ మ్యాచ్‌లను న్యూ చండీగఢ్‌లోని పీసీఏ స్టేడియంలో ఆడుతుంది. ఆర్సీబీకి బెంగళూరుతో పాటు రాయ్‌పూర్ రెండో హోమ్ గ్రౌండ్‌గా ఉండగా, పంజాబ్ కింగ్స్ ధర్మశాలలో, రాజస్థాన్ రాయల్స్ జైపూర్‌లో కూడా తమ హోమ్ మ్యాచ్‌లను ఆడనున్నాయి. అయితే బెంగళూరులో జరగాల్సిన మ్యాచ్‌లు కర్ణాటక ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉన్నాయి. మార్చి 13న ఈ కమిటీ చిన్నస్వామి స్టేడియాన్ని సందర్శించి, మ్యాచ్ నిర్వహణకు ఏర్పాట్లు సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలిస్తుంది. పూర్తిస్థాయి మాక్ డెమాన్‌స్ట్రేషన్ తర్వాతే బెంగళూరు వేదికపై తుది నిర్ణయం వెలువడనుంది.

# ఐపీఎల్ 2026 వాయిదాకే బీసీసీఐ మొగ్గు!

## -ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం ప్రభావం

**న్యూఢిల్లీ,మార్చి12(ఆర్ఎన్ఎ):** ఇండియన్ ప్రీమియర్ లీగ్ అభిమానులకు బ్యాడ్ న్యూస్! ఇరాన్ – ఇజ్రాయెల్ దేశాల యుద్ధం వల్ల ఇప్పుడు ఐపీఎల్ అర్ధాంతరంగా ఆగిపోయే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. పశ్చిమాసియాలోని యుద్ధం కారణంగా భారతదేశంలో ఇప్పుడు అనేక అవాంతరాలు ఏర్పడనున్నాయి. ఇప్పటికే గ్యాస్, ఇంధనం కొరత ఏర్పడం సహా ఇప్పుడు పరోక్షంగా అవి దేశంలోని వివిధ కార్యకలాపాలపై ప్రభావం చూపనున్నాయి. ఈ క్రమంలో ఐపీఎల్ వాయిదా పడొచ్చనే వార్తలపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఓ బిగ్ అప్‌డేట్ ఇచ్చింది. ఐపీఎల్ సరికొత్త సీజన్ 2026 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను బీసీసీఐ తాజాగా విడుదల చేసింది. ఇందులో టోర్నీలోని అన్ని మ్యాచ్‌లను కాకుండా కేవలం 20 మ్యాచ్‌లకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేయడం వల్ల అభిమానుల్లో అనేక రకాల పుకార్లకు తావిచ్చినట్లు అయ్యింది. ఐపీఎల్ 2026 టోర్నీ మార్చి 28న ఘనంగా ప్రారంభం కానుంది. కానీ, మరోవైపు ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధం తీవ్రరూపం దాల్చడం వల్ల ఐపీఎల్ సకాలంలో ప్రారంభం అవుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎందుకంటే యుద్ధ ప్రభావం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెటర్లు ఐపీఎల్‌లో పాల్గొనేందుకు అనేక సవాళ్లు ఎదుర్కొనే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. యుద్ధం కారణంగా ఇటీవలే టీ20 ప్రపంచకప్‌లో పాల్గొనేందుకు వచ్చిన వెస్టిండీస్, సౌతాఫ్రికా జట్లు రోజుల తరబడి భారత దేశంలోనే చిక్కుకుపోయారు. ఇప్పుడు తాజాగా స్వదేశానికి బయలుదేరారు. అంతేకాకుండా గ్యాస్ కొరత కారణంగా ప్రధాన నగరాల్లోని హోటళ్లు మూసివేత దిశగా పయనిస్తున్నాయి. అయితే భారతదేశంలో యుద్ధం ముప్పు తక్కువగా ఉన్నా.. విదేశాల నుంచి వచ్చే క్రికెటర్లు ప్రయాణ కష్టాలు.. యుద్ధం ఇలాగే కొనసాగితే హోటల్ కష్టాలు ఎదుర్కోక తప్పదనే వార్తలు వినిపిస్తున్నాయి. ఐపీఎల్ ఆగిపోతుందనే వార్తలపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా స్పందించారు. ఇప్పటికే ప్రకటించిన మార్చి 28 తేదీన ఐపీఎల్ ప్రారంభం అవుతుందని ఆయన ధ్రువీకరించారు. టోర్నీకి సంబంధించిన 20 మ్యాచ్‌ల షెడ్యూల్ విడుదల అయ్యిందని.. మిగిలిన మ్యాచ్‌లను రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం విడుదల చేసే తేదీలను బట్టి మిగిలిన టోర్నీ షెడ్యూల్‌ను నిర్ణయిస్తామని రాజీవ్ శుక్లా స్పష్టం చేశారు. యుద్ధం నేపథ్యంలో పరిస్థితులు తీవ్రంగా ఉన్నప్పటికీ.. ఐపీఎల్ ప్రారంభానికి ఇంకో రెండు వారాల సమయం ఉండడం వల్ల ఆ సమయానికి అంతా సర్దుకుంటాయని బీసీసీఐకి చెందిన మరో అధికారి ఆశాభావం వ్యక్తం చేశారు. హోటళ్లు, విమానయాన సంస్థలు, ఇతర అనేక విభాగాలు ఎలాంటి ఆందోళన చూపలేదని ఆయన తెలిపారు. అయితే ఈసారి ఐపీఎల్ నిర్వహణపై బీసీసీఐ పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# అర్షదీప్ సింగ్‌ను వెనకేసుకొచ్చిన గంభీర్..!

**న్యూఢిల్లీ,మార్చి12(ఆర్ఎన్ఎ):** టీ20 వరల్డ్ కప్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో అర్షదీప్ సింగ్, మిచెల్ మధ్య జరిగిన వాగ్వాదంపై టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. అర్షదీప్ సింగ్.. మిచెల్‌కు క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదన్నాడు గంభీర్. మార్చి 8వ తేదీ, ఆదివారం రోజున అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య టీ20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 11వ ఓవర్‌ను.. భారత పేసర్ అర్షదీప్ సింగ్ వేశాడు. అప్పుడు క్రీజ్‌లో న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ ఉన్నాడు. ఇక అర్షదీప్ సింగ్ వేసిన రెండు బంతులను వరుసగా డారిల్ మిచెల్ సిక్సర్లుగా మలిచాడు. దీంతో అర్షదీప్ తీవ్ర అసహనానికి గురయ్యాడు. ఆ తరువాత వేసిన మూడవ బంతిని మిచెల్ షాట్ ఆడగా.. బాల్‌ను అర్షదీప్ ఆపాడు. వెంటనే బాల్‌ను వికెట్ల పైకి విసరకుండా మిచెల్ పైకి విసిరాడు. దీనిపై మిచెల్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఏంటి అన్నట్లుగా అర్షదీప్ సింగ్‌ను ప్రశ్నించాడు. అర్షదీప్ మాత్రం ఏమీ పట్టించుకోకుండా, కనీసం క్షమాపణ చెప్పకుండా తిరిగి తరువాత బంతిని వేసేందుకు వెళ్లిపోయాడు.



# కష్టాల నాయకుడికి 'ప్రైమ్' షాకు ?

రాజకీయాలంటే అంతే. అడుగుపెట్టాక చాలా బురదను కడుక్కోవాల్సి ఉంటుంది. కొందరు తట్టుకుంటారు. కొందరు వదిలేస్తారు. చిరంజీవి ప్రజారాజ్యం విషయంలో ఎక్కడైతే విఫలమయ్యారో పవన్ కళ్యాణ్ అక్కడే జనసేన రూపంలో పోరాటం చేసి డిప్యూటీ సిఎం దాక వచ్చారు. పక్క రాష్ట్రంలో రజనీకాంత్, కమల్ హాసన్ తమ వల్ల కాదని తిరిగి సినిమాల్లోకి వస్తే, ఎంజిఆర్ లాంటి లెజెండరీ స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేకపోయారు. తాజాగా తన పొలిటికల్ ప్రస్థానాన్ని ఘనంగా ఆరంభించాలని చూస్తున్న విజయ్ కు ఎన్నో అడ్డంకులు తలెత్తుతున్నాయి. రోడ్ షోలో అభిమానులు చనిపోవడం, దాని మీద ఢిల్లీలో విచారణ, భార్య సంగీత విడాకుల వ్యవహారం, త్రిషతో ప్రేమాయణం పుకార్లు ఇలా రకరకాల వ్యూహాల్లో చిక్కుకున్నాడు. వీటికన్నా ముందు సంక్రాంతి నుంచి వాయిదా పడుతున్న జన నాయకుడు విడుదల గురించి స్పష్టత లేక ఫ్యాన్స్ అసహనానికి గురవుతున్నారు. చెన్నై టాక్ ప్రకారం జన నాయకుడు విడుదలలో విపరీతమైన జాప్యం జరిగిన కారణంగా అమెజాన్ ప్రైమ్ ఓటిటి డీల్ రద్దు చేసుకుందట. అధికారికంగా ఇంకా బయటికి చెప్పలేదు కానీ న్యూస్ అయితే జోరుగా చక్కర్లు కొడుతోంది. ఇస్తామన్న నూటా ఇరవై కోట్ల ఒప్పందం ఈ ఆలస్యం వల్ల నిర్మాత చేజారిపోయినట్టు వినికిడి. థియేటర్ రిలీజ్ డేట్ కు అనుగుణంగానే ఓటిటి అగ్రిమెంట్లు రాసుకుంటాయి. అది పదే పదే మిస్ అయితే క్యాన్సిల్ చేసుకునే హక్కు కూడా ఉంటుంది. గతంలో హరిహర వీరమల్లు విషయంలోనూ ఇదే సమస్య తలెత్తితే ఏదోలా నిర్మాత ఏఎం రత్నం మేనేజ్ చేసుకుంటూ వచ్చారు. చివరికి భారీ కోత విధించాక ఈ సినిమాని ప్రైమ్ కొందనే వార్త చక్కర్లు కొట్టింది. మరి జన నాయకుడుకి అలాంటి వెసులుబాటు ఇస్తారో లేదో చూడాలి. అయితే జన నాయకుడు విడుదలై బ్లాక్ బస్టర్ అయితే తర్వాతైనా కొనేందుకు ఓటిటిలు ముందుకు వస్తాయి. కొంచెం సొమ్ము తగ్గుతుంది అంతే. వీలైనంత త్వరగా నిర్మాణ సంస్థ కెవిఎన్ ఈ ప్రచారాలకు చెక్ పెట్టడం బెటర్.

# పవన్ ఫ్యాన్స్ బాధ అర్థం చేసుకున్నారు

అభిమానులందు పవన్ అభిమానులు వేరయా అంటే అందులో అతిశయోక్తి ఏమీ లేదు. ఆయనకున్న లాయల్ ఫ్యాన్ బేస్ ఇండియా మొత్తంలో చాలా కొద్దిమందికే ఉంటుంది. అన్ కండిషనల్ లవ్, సపోర్ట్ అన్న మాటలకు అర్థం పవన్ ఫ్యాన్స్ అని చెప్పొచ్చు. పవన్ తమకు నచ్చని సినిమా చేస్తే.. అది మేకింగ్‌లో ఉన్నంత కాలం ఎంత వ్యతిరేకించినా సరే.. బొమ్మ థియేటర్లలోకి వచ్చిందంటే కళ్లు మూసుకుని పవన్ దర్శనం కోసం వెళ్లిపోతారు. రీమేక్‌లు కావడం వల్ల కావచ్చు.. హీరో ఎలివేషన్లు ఆశించినంత ఉండకపోవచ్చన్న అంచనాల వల్ల కావచ్చు.. గోపాల గోపాల, కాటమరాయుడు, వకీల్ సాబ్, భీమ్లా నాయక్, బ్రో.. ఇలా చాలా సినిమాల విషయంలో పవన్ ఫ్యాన్స్ వ్యతిరేకతను ప్రదర్శించారు. కానీ ఆ చిత్రాలన్నింటికీ మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. విడుదల ముంగిట ఏమాత్రం ఆశలు లేని 'హరిహర వీరమల్లు' విషయంలోనూ ఇదే జరిగింది. పవన్ సినిమాల గురించి ముందు ఏమన్నా సరే.. రిలీజ్ టైంకి అన్నీ పక్కన పెట్టి థియేటర్లకు పరుగులు పెట్టేస్తారు అభిమానులు. ఐతే పవన్ అభిమానుల ఉత్సాహాన్ని నిర్మాతలు క్యాష్ చేసుకుంటున్నారనే విమర్శ ఎప్పట్నుంచో ఉంది. పవన్ సినిమాలకు పెయిడ్ ప్రిమియర్స్, బెనిఫిట్ షోలు ప్లాన్ చేస్తున్న నిర్మాతలు రూ.800-1000 మధ్య రేటు పెడుతున్నారు. ఈ రేట్లు మరీ ఎక్కువ అని అసంతృప్తి వ్యక్తం చేస్తూనే అభిమానులు టికెట్లు కొంటూ వస్తున్నారు. అభిమానులను దోచేసుకుంటున్నారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున కామెంట్లు వస్తున్నాయి. పవన్ రాజకీయ ప్రత్యర్థులు కూడా ఈ విషయాన్ని హైలైట్ చేస్తూ వస్తున్నారు. ఐతే పవన్ కొత్త సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్' విషయంలో మాత్రం నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఆచితూచి అడుగు వేసింది. ఏపీలో ప్రిమియర్స్‌కు ఎంత రేటు అడిగితే అంత ఇచ్చే పరిస్థితి ఉన్నా.. ఈ షోలకు రూ.500 రేటే అడిగారు. జీవో రావడం లాంఛనమే. బెనిఫిట్ షోలకు ఇది రీజనబుల్ రేటు అనడంలో సందేహం లేదు. అభిమానులు చాలా సంతోషంగా ఈ రేటు పెట్టి సినిమా చూస్తారు. తెలంగాణలో రేట్ల పెంపుకి ఛాన్సే ఉన్నట్లు కనిపించడం లేదు. నార్మల్ రేట్లతోనే బెనిఫిట్ షోలు వేస్తే ఆశ్చర్యం లేదు. రెగ్యులర్ షోలకు కూడా అవే రేట్లు కొనసాగే పరిస్థితి కనిపిస్తోంది. ఇది అభిమానులతో పాటు ప్రేక్షకులందరికీ ఉత్సాహాన్నిచ్చే విషయమే. దీని వల్ల ఫుట్ ఫాల్స్ పెరిగి అంతిమంగా నిర్మాతలకు కూడా మేలే జరుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.




## మార్కెటింగ్ అవసరం లేని కొత్త పాఠం

వందల కోట్లతో ప్యాన్ ఇండియా మూవీస్ తీస్తున్నప్పుడు పెద్ద ఎత్తున ప్రమోషన్లు అవసరం. ఎవరికైనా ఇది తప్పదు. ఎప్పుడో 2027 ఏప్రిల్ లో వచ్చే వారణాసి కోసం రాజమౌళి ఇప్పటి నుంచే విదేశీ మీడియాకు ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. టైటిల్ లాంచ్ కోసమే కోట్లు ఖర్చు పెట్టి హైదరాబాద్ లో ఈవెంట్ చేశారు. నెలకోసారి ఏదో రూపంలో ట్రెండింగ్ అయ్యే కంటెంట్ ఇస్తున్నాడు. ఇదంతా గ్లోబల్ అటెన్షన్ కోసమే. బడ్జెట్ తో సంబంధం లేకుండా ప్రతి సినిమాకు ఇది ఫాలో కావాల్సిందే. కానీ దురంధర్ ది రివెంజ్ కొత్త గ్రామర్ నేర్పిస్తోంది. ఇది వరకు బాలీవుడ్ మేకర్స్ చదవని మార్కెటింగ్ పాఠాన్ని చదువుకోమంటోంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్నా నిర్మాత సంస్థ జియో స్టూడియోస్, నిర్మాత కం దర్శకుడు ఆదిత్య ధార్ ఎలాంటి పబ్లిసిటీ చేయడం లేదు. ఇంటర్వ్యూలు ఇవ్వడం, కపిల్ శర్మ లాంటి కామెడీ షోలలో పాల్గొని స్కిట్లు చేయడం లాంటి వాటికి దూరం ఉంటున్నారు. రణ్వీర్ సింగ్, సంజయ్ దత్, అక్షయ్ ఖన్నా, అర్జున్ రాంపాల్ లాంటి పెద్ద క్యాస్టింగ్ ఉన్నప్పటికీ ఎవరూ మీడియా కెమెరా ముందుకు రావడానికి ఇష్టపడటం లేదు. ఇంత లో ప్రొఫైల్ మెయింటైన్ చేస్తున్నా బుకింగ్స్ మాత్రం అదిరిపోతున్నాయి. ఇప్పటికే 50 కోట్లు వసూలైపోగా రోజుకు బుక్ మై షోలో కనిష్టంగా 30 వేలకు పైగా టికెట్లు అమ్ముడుపోతున్నాయి. దురంధర్ మొదటి భాగం ప్రభావం ఏ స్థాయిలో ఉందంటే రేపటి నుంచి ఇండియా వైడ్ అయిదు రోజుల పాటు మరోసారి దీన్ని స్క్రీనింగ్ చేస్తున్నారు. హిందీలోనే ఇలా ఉంటే ఇక తెలుగు తమిళ ప్రమోషన్లు ఏం పట్టించుకుంటారు. అయినా సరే హైదరాబాద్ లో ఆల్ టైం రికార్డు నమోదయ్యేలా ఉంది. ఏపీ మెయిన్ సెంటర్స్ లో సాయంత్రం షోలు దాదాపు ఫుల్ అయ్యాయి. రాత్రికి పాజిటివ్ టాక్ వస్తే నెక్స్ట్ డే నుంచి ఉస్తాద్ భగత్ సింగ్ ఉన్నా సరే వసూళ్ల మోత ఖాయం. ఇక్కడ గమనించాల్సిన పాయింట్ ఒకటుంది. కంటెంట్ స్ట్రాంగ్ గా ఉంటే ఎలాంటి గిమ్మిక్కులు చేయకపోయినా జనం ఆటోమేటిక్ గా సినిమా చూస్తారు. కానీ అన్ని సినిమాలకు ఇదే సూత్రం వర్తించదు. ఎలా చూసుకున్నా దురంధర్ ఆస్కార్ మెట్లు ఎక్కలేదు. ఎక్కే ఛాన్స్ లేదు. కానీ వారణాసి లాంటివి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకునే స్కోప్ ఉన్నవి. అందుకే జక్కన్న అంతగా కష్టపడతారు. దురంధర్ కు అంత శ్రమ అవసరం లేదు కాబట్టి రిలాక్స్ అవుతుంది.

# బిజినెస్ న్యూస్

## అశోక్ లేలాండ్ రూ.500 కోట్ల పెట్టుబడి: ఎందుకంటే?



వాణిజ్య వాహన తయారీ హిందుజా గ్రూప్ దిగ్గజం అశోక్ లేలాండ్ తాజాగా గ్రీన్‌ఫీల్డ్ బ్యాటరీ ప్యాక్ తయారీపై దృష్టి పెట్టింది. ఇందుకు చెన్నై సమీపంలో తయారీ యూనిట్ నెలకొల్పేందుకు రూ. 500 కోట్లవరకూ ఇన్వెస్ట్ చేయనున్నట్లు వెల్లడించింది. వెరసి కొత్త బ్యాటరీ ప్యాక్ తయారీ ప్లాంటు ఏర్పాటుకు వీలుగా పిళ్లైపక్కం(చెన్నై)లో భూమి పూజ నిర్వహించినట్లు పేర్కొంది. ఈ ప్రాజెక్టుపై రూ. 400--500 కోట్లు వెచ్చించనున్నట్లు తెలియజేసింది. ఇందుకు 2025 సెప్టెంబర్‌లోనే హిందుజా గ్రూప్ పెట్టుబడులలో భాగంగా అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రయాణంలో ఇది కీలక ముందడుగుగా కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ధీరజ్ హిందుజా పేర్కొన్నారు. అంతేకాకుండా దేశీయంగా పటిష్ట ఈవీ ఎకోసిస్టమ్ ఏర్పాటులో తమ కట్టుబాటుకు మరింత మద్దతివ్వనున్నట్లు వివరించారు. తద్వారా దేశీయంగా ఈవీ బ్యాటరీ ప్యాక్ ఉత్పత్తికి వీలు కల్పించనున్నట్లు తెలియజేశారు.

## పెరగనున్న ఆడి కార్ల ధరలు: ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి

జర్మన్ లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడి.. భారతదేశంలో తన ఉత్పత్తుల ధరలను 2 శాతం వరకు పెంచనున్నట్లు తెలిపింది. ఇన్‌పుట్ ఖర్చులు పెరగడం, కరెన్సీ హెచ్చుతగ్గుల కారణంగా 2026 ఏప్రిల్ 1 నుంచి కొత్త ధరలు అమల్లోకి రానున్నట్లు వెల్లడించింది. ఏ మోడల్ ధర ఎంత అనేది త్వరలోనే తెలుస్తుంది. ధరల అప్డేట్ గురించి ఆడి ఇండియా బ్రాండ్ డైరెక్టర్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ మాట్లాడుతూ.. ధరల పెరుగుదల ప్రభావాన్ని మా కస్టమర్లపై తగ్గించడానికి మేము కట్టుబడి ఉన్నాము" అని అన్నారు. ధరల పెరుగుదల భారతదేశంలో ఆడి యొక్క పూర్తి లైనప్‌ను ప్రభావితం చేస్తుంది, ఇందులో ఆడి Q4, Q5, Q6, Q3, Q3 స్పోర్ట్‌బ్యాక్, Q5, Q7, Q8 & RSQ8 పెర్ఫార్మెన్స్ వంటి మోడళ్లు ఉన్నాయి. 2026 జనవరి నెలలో దేశీయ వాహన తయారీ సంస్థలు మాత్రమే కాకుండా.. బిఎండబ్ల్యు, మెర్సిడెస్ బెంజ్ కంపెనీలు కూడా తమ ఉత్పత్తుల ధరలను పెంచినట్లు అధికారికంగా వెల్లడించాయి. ఇప్పుడు అదే బాటలో ఆడి ఇండియా కూడా అడుగులు వేసింది.

## వాట్సప్, ఫేస్‌బుక్‌లో యాంటీ స్కామ్ టూల్స్.. ఎలా పనిచేస్తాయంటే?

వాట్సప్, ఫేస్‌బుక్ వేదికగా జరిగే మోసాలకు చెక్ పెట్టేందుకు మెటా సిద్ధమైంది. సైబర్ నేరగాళ్ల నుంచి యూజర్లను రక్షించేందుకు కొత్తగా యాంటీ స్కామ్ టూల్స్‌ను ప్రవేశపెట్టింది. వాట్సప్, ఫేస్‌బుక్, మెసెంజర్ యాప్‌లలో ఆయా టూల్స్ పనిచేస్తాయి. ఇవి మోసాలను గుర్తించడంతో పాటు కేటుగాళ్ల బారిన పడకుండా యూజర్లను నిలువరించడంలో సాయపడతాయి. వాట్సప్ వేదికగా నిత్యం సైబర్ మోసాలు జరుగుతుంటాయి. ఇందులో డివైజ్ లింకింగ్ ఫీచర్ ఉపయోగించేవి చేసేవే అధికం. వాట్సప్ యూజర్ల సౌలభ్యం కోసం తీసుకొచ్చిన ఈ ఫీచర్ ద్వారా కేటుగాళ్లు సదరు వ్యక్తి అకౌంట్‌ను తమ అధీనంలోకి తీసుకుంటున్నారు. వారి వ్యక్తిగత సందేశాలు చదవడంతో పాటు, వారి పేరిట డబ్బులు అడగడం, గ్రూపుల్లో ఏపీకే ఫైల్స్‌ను పోస్ట్ చేయడం వంటివి చేస్తుంటారు. ఇలా లింక్ డివైజ్ ఫీచర్ దుర్వినియోగం కాకుండా ఉండేందుకు వాట్సప్ కొత్త సదుపాయం తీసుకొచ్చింది. ఎవరైనా లింక్ డివైజ్‌ను అనధికారికంగా వాడుదామని ప్రయత్నిస్తే.. చివరి నిమిషంలో 'బహుశా ఇది స్కామ్ అయ్యుండొచ్చు' అంటూ ఒక అలర్ట్ చేయడంతో పాటు 'డోంట్' లింక్ అనే ఆప్షన్ క్లిక్ చేసి బయటకు వచ్చేసే అవకాశాన్ని మెటా కల్పిస్తోంది. కొన్నిసార్లు ఫేస్‌బుక్ ఫ్రెండ్ లిస్ట్‌లో ఉన్న వ్యక్తుల నుంచే మళ్లీ కొత్తగా ఫ్రెండ్ రిక్వెస్టులు వస్తుంటాయి. ఇంకో ఖాతా అయ్యుంటుందిలే అని యాక్సెప్ట్ చేసే వారే ఎక్కువ. ఇది వరకే కొందరు మ్యూచువల్ ఫ్రెండ్స్ ఉండడం వల్ల ఎక్కువ మంది నమ్మి ఓకే చేస్తుంటారు. కొద్ది రోజుల తర్వాత ఆ ఖాతా నుంచి మెసేజులు పెడుతూ అత్యవసరం పేరిట డబ్బులు అడగడం వంటివి చేస్తుంటారు. ఈ తరహా మోసాలకు చెక్ పెట్టేందుకు మెటా కొత్త ఏఐ టూల్‌ను తీసుకొచ్చింది. ఏదైనా అనుమానిత ఫేస్‌బుక్ ఖాతా నుంచి ఫ్రెండ్ రిక్వెస్ట్ వస్తే.. వారి లొకేషన్, మ్యూచువల్ కాంటాక్టులు, ఫేస్‌బుక్‌లో చేరి ఎన్ని రోజులైంది? వంటి వివరాలు చూపించి అలర్ట్ చేస్తుంది. ఫేస్‌బుక్ మెసెంజర్‌లో కూడా కొత్త ఖాతా నుంచి వచ్చే సందేశాల పట్ల యూజర్లను అప్రమత్తం చేస్తుంది.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

గురువారం ఉదయం నష్టాల్లో మొదలైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి భారీ నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ 829.29 పాయింట్ల నష్టంతో 76,034.42 వద్ద, నిఫ్టీ 227.70 పాయింట్ల నష్టంతో 23,639.15 వద్ద నిలిచాయి. ఐసీడీఎస్ లిమిటెడ్, రీగాల్ రిసోర్సెస్ లిమిటెడ్, డీసీఎం ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, కాన్ఫిడెన్స్ పెట్రోలియం ఇండియా లిమిటెడ్, ఉషా మార్టిన్ ఎడ్యుకేషన్ ఆ సొల్యూషన్స్ లిమిటెడ్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరాయి. ప్రజయ్ ఇంజనీర్స్ సిండికేట్ లిమిటెడ్, క్రియేటివ్ ఐ లిమిటెడ్, అవాన్మోర్ క్యాపిటల్ ఆ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ లిమిటెడ్, అక్యూస్ లిమిటెడ్, కేంబ్రిడ్జ్ టెక్నాలజీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ కంపెనీలు నష్టాలను చవిచూశాయి.

## రెండో రోజు శాప్ చైర్మన్ ఢిల్లీ పర్యటన

### -పలువురు కేంద్ర మంత్రితో భేటీ

**తిరుపతి,మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కేంద్ర క్రీడాశాఖ మంత్రి మనసుఖ్ మాండవ్య ను కేంద్ర పౌర విమాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు, అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి లతో కలిసిన శాప్ చైర్మన్ రవి నాయుడు ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న క్రీడల అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించారు. ఖేలో ఇండియా ఇన్ఫ్రా కింద పలు క్రీడా ప్రాజెక్టులకు నిధుల మంజూరు చేయాలని ఆయన మాండవ్యను కోరారు. అమలాపురం, ఏలూరు, తిరుపతి, విశాఖపట్నం, కుప్పం, కర్నూలు, విజయవాడ, మచిలీపట్నం, గుంటూరు ప్రాంతాల్లో ప్రాజెక్టుల ప్రతిపాదనలు మొత్తం 53 ప్రాజెక్టులకు రూ.1106 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని 28 జిల్లాల్లో ఆర్చరీ రేంజ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. మచిలీపట్నం, తిరుపతి, విశాఖపట్నం వద్ద ఋషికొండ బీచ్, సూర్యలంక బీచ్ లలో వాటర్ స్పోర్ట్స్ సెంటర్లు, విశాఖపట్నంలో స్టేట్ లెవల్ పారా స్పోర్ట్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. రవి నాయుడు ప్రతిపాదనలకు మంత్రి మనసుఖ్ మాండవ్య సానుకూలంగా స్పందించారు. సమావేశంలో శాప్ ఎండి భరణి కూడా పాల్గొన్నారు,

## తొట్టంబేడులో హెచ్‌పివి వ్యాక్సిన్ ప్రారంభం

**తొట్టంబేడు, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలంలోని తొట్టంబేడు పీహెచ్సీలో తొట్టంబేడ్ పిహెచ్‌సీ డాక్టర్ సాయి పూజ 14 సంవత్సరాలు పైబడిన విద్యార్థినిలకు గురువారం వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ బాలికలకు తప్పకుండా ఈ వ్యాక్సిన్ను వేయించాలని విజ్ఞప్తి చేశారు. 14 ఏళ్ళు నిండిన బాలికలు క్యాన్సర్ బారిన పడకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వ్యాక్సిన్ను ఉచితంగా అందిస్తున్నాయని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎన్ నీరజ, పిహెచ్ఎన్ సంపూర్ణమ్మ, సూపర్వైజర్ ధనమ్మ, ఏఎన్ఎం వరలక్ష్మి, సంధ్య, లిఖిత్ పాల్గొన్నారు.

## లింగ సమానత్వంతోనే మహిళల అభివృద్ధి సాధ్యం: ఏపీఎం

**రామచంద్రాపురం, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సమాజంలో అందరూ లింగ బేధాలు చూపకుండా సమానత్వం పాటిస్తేనే మహిళల అభివృద్ధి జరుగుతుందని వెలుగు ఎపియం గురుమూర్తి అన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో డ్వాక్రా విఓఏలకు, మండల సమాఖ్య ఈసీ సభ్యులకు, జెండర్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్క కుటుంబంలో ఆడ మగ సమానమనే ఆలోచన ధోరణి పెంపొందించుకోవాలన్నారు. మహిళా చట్టాల గురించి వివరించారు. మహిళలు వేధింపులకు గురికాకుండా ఉండేవిధంగా జాగ్రత్త తీసుకోవాలని తెలియజేశారు. డ్వాక్రా సంఘాలలోని మహిళలకు సమస్యలు ఏర్పడితే జెండర్ కమిటీ దృష్టికి తెలియజేయాలన్నారు. జనరల్ కమిటీ సభ్యులు ఆ సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు. స్వయం సహాయక సంఘాలలో ఉండే మహిళలందరూ జెండర్ రిసోర్సె సెంటర్ సేవలను సద్వినియోగించుకోవాలని కోరారు. పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ భక్తవత్సలం మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాలలో ఎక్కడైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా సంఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాలలో జూదం, గంజాయి, కోడిపందాలు, బెట్ షాపుల్లో మద్యం విక్రయాలు సాగిస్తూ ఉంటే పోలీసులకు తెలియజేయాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో వివోఏలు, మండల మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యులు, సీసీలు సుధాకర్, పార్వతమ్మ, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## కిషోర్ బాలికలు హెచ్‌పి వ్యాక్సిన్ వేయించుకోవాలి

**రామచంద్రాపురం, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కిషోర్ బాలికలు, 14 నుంచి 15 సంవత్సరాల వయస్సు వున్న ప్రతి బాలిక హెచ్పీవీ (యూమన్ ఫపిలోమా వైరస్) వ్యాక్సిన్ వేయించుకోవాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ ఎన్ మురళీమోహన్(చిన్న బాబు) కోరారు. గురువారం కమ్మపల్లి పీహెచ్సీలో రాష్ట్ర ఎంఎస్ఎమ్ఈ డైరెక్టర్ ఎన్ మురళీమోహన్ వ్యాక్సి నేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గర్భస్థ క్యాన్సర్ ముందస్తు నివారణకు కేంద్ర ప్రభుత్వ చొరవతో మూడు నెలల పాటు కార్యక్రమం జరుగుతుందన్నారు. బాలికలు ఈ వ్యాక్సిన్ తీసుకోవడంతో జీవితాంతం గర్భస్థ క్యాన్సర్ నుంచి ఉపశమనం పొందవచ్చున్నారు. కార్యక్రమంలో కమ్మపల్లి పీహెచ్సీ డాక్టర్ చత్ర ప్రకాశ్ రెడ్డి, డాక్టర్ మురళీకృష్ణ వైద్య సిబ్బంది రమేష్ బాబు, ప్రమీల, సుబ్రహ్మణ్యం, పి జయలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## అహుడ గ్రీవెన్స్ త్వరితగతిన పరిష్కరించాలి: సెక్రటరీ

**అనంతపురం, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అనంతపురం–హిందూపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (అహుడా) పరిధిలో వస్తున్న గ్రీవెన్స్ త్వరితగతిన పరిష్కరించాలని అహుడ సెక్రటరీ జి.రామకృష్ణారెడ్డి ఆదేశించారు. గురువారం నగరంలోని అహుడ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా నారాయణపురం పంచాయతీలో ఎలైట్ అపార్ట్మెంట్ లో పార్కింగ్ స్థలాన్ని షాపింగ్ కాంప్లెక్స్‌గా మారుస్తున్నారని, దానిపై తగిన చర్యలు తీసుకోవాలని అర్జీదారులు అర్జీ అందించారు. మార్ట్ గేజ్ పరిశీలన చేయాలని అర్జీ అందించారు. ఉప్పరపల్లిలో అనధికార లేఅవుట్ లో భవనం కడుతున్నారని, కక్కలపల్లి ఎల్ఆర్ఎస్ ఓపెన్ సైట్‌ని వెరిఫై చేయాలని, ఎల్ఆర్ఎస్ అప్రూవల్ కావాలని అర్జీలు సమర్పించగా, అర్జీలను వేగంగా పరిష్కరించాలని అహుడ సెక్రటరీ ఆదేశించారు. కార్యక్రమంలో అహుడ పిఓ ఇషాక్, ఇంజినీర్ దుష్యంత్, ఈఓ అరుణ కుమారి, ఏఓ రవిచంద్రన్, పబ్లిక్ హెల్త్ ఆఫీసర్, జెపీఓ హరీష్ చౌదరి, డీఈ రేవంత్, సర్వేయర్ శరత్, తదితరులు పాల్గొన్నారు.




## మార్చి 15న తాళ్లపాక అన్నమయ్య వర్ధంతి

**తిరుమల, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పదకవితా పితామహుడు శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల 523వ వర్ధంతి మహోత్సవాన్ని మార్చి 15న తిరుమలలో టీటీడీ నిర్వహించనుంది. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయం నుండి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు ఊరేగింపుగా బయల్దేరి సాయంత్రం 6 గంటలకు నారాయణగిరి ఉద్యానవనాలకు చేరుకుంటారు. అనంతరం అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సప్తగిరి సంకీర్తనా గోష్ఠిగానం నిర్వహించనున్నారు. అటు తరువాత స్వామివారు ఉభయదేవేరులతో కలిసి ఆలయానికి వేంచేపు చేస్తారు.

## మంత్రి నారా లోకేష్‌కు సాదర స్వాగతం

**తిరుపతి,మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రేణిగుంట విమానాశ్రయానికి గురువారం చేరుకున్న రాష్ట్ర విద్యాశాఖ, ఐటి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ మరియు ఆర్టిజి శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఘన స్వాగతం లభించింది. నెల్లూరు జిల్లా పర్యటన నిమిత్తం గురువారం రేణిగుంట విమానాశ్రయానికి నారా లోకేష్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, చంద్రగిరి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, గూడూరు ఎమ్మెల్యే లు పులివర్తి నాని, నెలవెల విజయశ్రీ, బొజ్జల సుధీర్ రెడ్డి, పాశం సునీల్ కుమార్, ఎంఎల్‌సి బల్లి కళ్యాణ చక్రవర్తి, తుడా చైర్మన్ సి దివాకర్ రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మీ, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సి మునికృష్ణ, కార్పొరేట్లు, నరసింహచారి నరేంద్ర, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్, తదితర అధికారులు ప్రజాప్రతినిధులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

## విద్యార్థులకు మూత్రపిండాల వ్యాధులపై అవగాహన

**తిరుపతి,మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్విమ్స్ నెఫ్రాలజి విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా స్థానిక వెంకటపతి నగర్ లోని టిటిడి శ్రీ కపిలేశ్వర స్వామి హైస్కూల్ విద్యార్థులకు కిడ్నీ వ్యాధులు, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెఫ్రాలజి విభాగాధిపతి మరియు మెడికల్ సూపరింటెండెంట్ డా॥ రామ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి 2వ గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవం జరుపుకుంటామని. ప్రతి ఒక్కరూ మానసిక ప్రశాంతతో వుంటే ఆరోగ్యవంతమైన జీవనం సాధించవచ్చునని పేర్కొన్నారు. ఆహారం తగిన మోతాదులో తీసుకోవాలని, ఎక్కువగా తీసుకోవడం వల్ల బి.పి, షుగర్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో భాగంగా స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు బి.పి, యూరిన్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. మంచి పౌష్టికహారం తీసుకోవాలని, తగిన వ్యాయామం చేయాలని తెలిపారు. ప్రతిఒక్కరు క్లినికల్ పరీక్షలు చేసుకోవడం ద్వారా ముందస్తుగా కిడ్నీ సమస్యల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చునని తెలియజేశారు. కార్యక్రమం స్విమ్స్ ఎంఎస్‌డబ్ల్యూ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ప్రసాద్ మాట్లాడుతు స్విమ్స్‌లో 1994లో 6 మిషన్ లతో ప్రారంభమై డయాలసిస్ విభాగం నేడు 100 మిషన్లతో 750 మందికి 24 గంటలు సేవలు అందిస్తోందని, సౌత్ ఇండియాలోనే అత్యధిక ప్రమాణాలతో కలిగిన ఏకైక సంస్థ స్విమ్స్ నెఫ్రో ప్లస్ ద్వారా వైద్య సేవలు అందించడం జరుగుతుందని, డయాలసిస్‌లో ప్రత్యేక వైద్యుల పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నెఫ్రాలజీ విభాగం వైద్యులు, కపిలేశ్వర స్వామి స్కూల్ హెడ్మాస్టర్ కె.కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, స్విమ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 'గ్యాస్' వదంతులు నమ్మొద్దు

### -గ్యాస్ నిల్వలు తగినంతగా ఉన్నాయి: జేసీ గోవిందరావు

**తిరుపతి,మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇరాన్ ఇజ్రాయిల్ యుద్ధ ప్రభావం వలన గృహ అవసరాలకు సంబంధించిన గ్యాస్ నిల్వలు కొరత విషయంలో ఎలాంటి వదంతులు నమ్మవద్దని జిల్లాలో తగినంతగా గ్యాస్ నిల్వలు ఉన్నాయని జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నందు జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీల తో గ్యాస్ నిల్వల పై జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. ఇరాన్ ఇజ్రాయిల్ యుద్ధ ప్రభావం వలన గృహ అవసరాలకు సంబంధించిన గ్యాస్ నిల్వలు కొరత ఏర్పడినట్లు వస్తున్న ఎలాంటి వదంతులు నమ్మవద్దని తగినంతగా గ్యాస్ నిల్వలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో గ్యాస్ సరఫరా సజావుగా అందరికీ చేయడం జరుగుతుందన్నారు. గృహ అవసరాలకు గ్యాస్ సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని గ్యాస్ ఏజెన్సీల యాజమాన్యాలను ఆదేశించారు. గృహ అవసరాలతో పాటు వసతి గృహాలకు తగినంత గ్యాస్ సరఫరా ఉండేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శేషాచలం రాజు, డిప్యూటీ తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన దివ్యాంగులకు ఉచిత పరికరాల శిబిరం

**ఏర్పేడు, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మార్చి 13న అర్హులైన దివ్యాంగులకు ఉచిత సహాయక పరికరాల పంపిణీ శిబిరం నిర్వహించనున్నట్లు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో ఎలక్ట్రానిక్ వీల్ చైర్లు, బ్యాటరీ ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు, చేతికర్రలు, కృత్రిమ అవయవాలు వంటి పరికరాలు అర్హులైన దివ్యాంగులకు అందజేయనున్నారు. శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్ కార్డు, సదరం లేదా UDID కార్డు, రేషన్ కార్డు లేదా ఆదాయ ధృవీకరణ పత్రం, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు రెండు సెట్ల జిరాక్స్‌తో తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని అర్హులైన దివ్యాంగులు వినియోగించుకోవాలని ఏర్పేడు టీడీపీ అధ్యక్షుడు పేరం నాగరాజ నాయుడు కోరారు.

## రోడ్లు, కాలువల్లో చెత్త వేస్తే ఆన్‌లైన్ జరిమానాలు!

### -ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

### -సిసి కెమెరాల ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్ ఎన్.మౌర్య

**తిరుపతి,మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరంలోని కాలువల్లో, రోడ్లపైన చెత్త వేసే వారిని సిసి కెమెరాల ద్వారా గుర్తించి ఆన్లైన్ జరిమానాలు విధించనున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా నగరంలోని ఏర్పాటు చేస్తున్న సిసి కెమెరాల పనితీరును స్మార్ట్ సిటీ, కెల్ట్రాన్ సంస్థ, అప్కాన్స్ ప్రతినిధులతో కలసి కమిషనర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా నగరంలోని 20 కూడళ్లు, 111 ప్రదేశాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కెమెరాలను ఇంటిగ్రెటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తారని, సిసి టివి సర్వైవ్ లెన్స్ ద్వారా నగరంలోని 111 ప్రాంతాల్లో సిసి టివి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. వీటి ద్వారా కాలువల్లో, రోడ్లపైన చెత్త వేసేవారిని గుర్తించి జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు. అలాగే నగరంలో ఉత్పత్తి అయ్యే భవన నిర్మాణ వ్యర్థాలు వేసిన వారిని గుర్తించి జరిమానాలు విధిస్తామని తెలిపారు. జూ పార్కు రోడ్డులోని 9 ప్రాంతాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటి ద్వారా అడవి జంతువుల కదలికలు గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టే వీలుంటుందని తెలిపారు. అలాగే నగరంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా భద్రత కల్పించే వీలుంటుందన్నారు. అలాగే నగరంలోని 20 కూడళ్ళ అడాప్టివ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నారని, వీటి ద్వారా సమయానుకూలంగా సిగ్నల్ మారడంతో కూడళ్ళ వద్ద ట్రాఫిక్ తగ్గుతుందని తెలిపారు. అత్యవసర వాహనాలు అంబులెన్సు వంటివి త్వరగా వెళ్లేలా సమన్వయం చేసి, ప్రమాదాలను తగ్గించే వీలుంటుందని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించిన వారికి ఈ–చలాన్ ద్వారా ఆన్లైన్ జరిమానాలు విధించడం జరుగుతుందని తెలిపారు. నగరంలో ఏర్పాటు చేసిన సీసీటీవీ సర్వైలెన్స్, కెమెరాల ద్వారా చెత్త వేయడం, భవన నిర్మాణ వ్యర్థాలు రోడ్లపై పారవేయడం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారి చర్యలు కెమెరాల్లో నమోదు అవుతాయని తెలిపారు. వీటి ద్వారా ఆన్లైన్ జరిమానాలు విధించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు నగర శుభ్రత, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా జరిమానాలు తప్పించుకోవడంతో పాటు నగర అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, ఈ.ఈ.రవి, ట్రాఫిక్ పోలీసులు, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, కెల్ట్రాన్, అప్కాన్స్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వాగ్దేవి నర్సింగ్ కళాశాలలో ఘనంగా 'ల్యాంప్ లైటింగ్'

**తిరుపతి,మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నర్సింగ్ వృత్తి ద్వారా సమాజానికి సేవ చేసే అవకాశం నర్సులకు లభిస్తుందని వాగ్దేవి నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె. లావణ్య కుమారి తెలిపారు. తిరుపతి మల్లంగుంటలోని వాగ్దేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్ నందు విద్యనభ్యసిస్తున్న బిఎస్‌సి నర్సింగ్ విద్యార్థుల ల్యాంప్ లైటింగ్, ప్రతిజ్ఞ స్వీకార కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సంప్రదాయబద్ధంగా దీపాన్ని వెలిగించి, విద్యార్థుల చేత నర్సింగ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.లావణ్య కుమారి మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి సమాజానికి అత్యంత కీలకమని, రోగులకు సేవ చేయడం ఒక పవిత్రమైన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రపంచ నర్సింగ్ రంగానికి మార్గదర్శకురాలైన ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలను స్మరించుకుంటూ, ఆమె చూపిన మార్గంలో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో నర్సింగ్ విద్యను అభ్యసించి, సమాజానికి సేవ చేసే ఉత్తమ నర్సులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తోట భార్గవి, యం.గీత, టి.కీర్తి, జె. శివరంజని, సి.వనిత, బి.కల్పన, కె.పవిత్ర, జిఆర్ స్నేహా ప్రసన్న, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి వీర విధేయుడు మాదాసు కృష్ణయ్య మృతి

### పార్టీకి తీరని లోటు: ఎమ్మెల్యే పులివర్తి నాని

**రామచంద్రాపురం, మార్చి 12 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలంలోని రాయలచెరువు గ్రామానికి చెందిన బీసీ సీనియర్ నాయకుడు మాదాసు మాధవయ్య తండ్రి టిడిపి వీరాభిమాని మాదాసు కృష్ణయ్య మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. గురువారం రాయలచెరువులో జరిగిన కృష్ణయ్య కర్మ క్రియలకు హాజరై ఆయన చిత్రపటానికి పుష్పాంజల ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుండి పార్టీకి వీర విధేయుడుగా కృష్ణయ్య చేసిన సేవలను కొనియాడారు. అనంతరం మాదాసు మాధవయ్య, దామోదరం కుటుంబ సభ్యులను పరామర్శించి, కృష్ణయ్య మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో మేకల తిరుమలరెడ్డి, చేకూరి జనార్దన్ చౌదరి, మాజీ ఈతమాకుల ఉమాపతి నాయుడు, తానికొండ కేశవులనాయుడు,, మాజీ సర్పంచులు నాగభూషణం, బి ధనుంజయులు, నాదముని యాదవ్, సురేందర్ నాయుడు, మహేష్ నాయుడు, కొట్టే గిరిధర్ రెడ్డి, గోపీనాథ్ రెడ్డి, జయచంద్ర నాయుడు, రావిళ్ళ గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027